

● వరద ఉధృతికి గండి వద్ద కోతకు గురై పొలాలను ముంచెత్తుతున్న వరద నీరు

వరద.. వణుకు



తాడేపల్లి రైలు వంతెనల వద్ద కృష్ణమ్మ పరుగులు



రేపల్లె : బోటులో పల్లెపాలెంకు చెందిన ప్రజలను సురక్షితప్రాంతాలకు తరలిస్తున్న అధికారులు

- కృష్ణమ్మ మహోగ్రరూపం
- సాగర్‌కు రికార్డు స్థాయిలో వరద
- తెరపిచ్చిన వాన.. ఉధృతంగా వాగులు
- కృష్ణానది కుడి కరకట్టను తాకిన ప్రవాహం
- పలు ప్రధాన మార్గాల్లోనూ నిలిచిన రాకపోకలు
- భయం గుప్పిట్లో నదీ తీర, లంక గ్రామాల ప్రజలు
- ముంపులో ఉమ్మడి గుంటూరు జిల్లాలో లోతట్టు ప్రాంతాలు
- ముంపు ప్రాంతాల్లో కలెక్టర్లు పర్యటన.. సహాయక చర్యల పరిశీలన
- ఎక్కడికక్కడ బాధితులు సురక్షిత, పునరావాస ప్రాంతాలకు తరలింపు
- బ్యారేజీ నుంచి 10.10 లక్షల క్యూసెక్కులకు చేరిన వరద ప్రవాహం

ఆకాశానికి చిల్లుపడిందా.. మేఘాలు ముంచెత్తాయా.. అన్నట్లు వరుణుడు చెలరేగగా.. ఆ ప్రభావం ఆదివారం వరద రూపంలో ముంచెత్తింది. కుంభవృష్టితో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలు చిగురుటాకులా వణికిపోగా ఆదివారం వరుణుడు విరా మం తీసుకున్నాడు. అయినా కృష్ణమ్మ మహోగ్రంగా సాగరం దిశగా పరుగులు తీస్తోంది. కృష్ణమ్మ కన్నెర్రతో తీర ప్రాంత గ్రామాలు, డెల్టాలోని లంకలు, పల్లె వాసులు వణికిపోతున్నారు. ప్రాణ రక్షణతో భీతిల్లిపోతున్న వారిని అధికారులు ఎక్కడికక్కడ సహాయ శిబిరాలకు, పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. వాగులు, వంకలు రోడ్డెక్కగా.. పల్లపు ప్రాంతా లను వర్షపు నీరు చుట్టేసింది. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇక ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదలైన నీటి ప్రవాహం లంకలను ముంచేస్తోంది. బ్యారేజీకు ఆదివారం అర్ధరాత్రికి 10.10 లక్షల క్యూసెక్కులు దాటినట్లు అధికారులు తెలిపారు. సోమవారం తలెత్తే ఎలాంటి పరిస్థితులునైనా ఎదుర్కొనేందుకు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు అధికారులు సిద్ధం చేశారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పై నుంచి వచ్చే వరద తోడవడంతో నష్ట తీవ్రత భారీగా పెరిగింది.

గుంటూరు, తెనాలి, బాపట్ల, నరసరావుపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా వర్షాలు కురిసిన వర్షాలతో కృష్ణానదితో పాటు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షాలతో జనజీవనం అతలాకుతలం కాగా.. ఆదివారం ముంచెత్తుతోన్న వరదతో ప్రజలు భయం గుప్పిట్లో చిక్కుకున్నారు. ఎటు చూసినా నీరే.. వాగులు వంకలు పొంగి పొలాలను ముంచెత్తగా ప్రధాన రహదారులు తటాకాలను మరిపిస్తున్నాయి. పలు కాలనీలు, లంక గ్రామాలు, నదీ తీర గ్రామాలను కృష్ణమ్మ చుట్టేసింది. పలు ప్రాంతాల్లోని పల్లెలు, పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు కూడా ముంపునకు గురయ్యాయి. రెండురోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆదివారం తగ్గుముఖం పట్టినా సాగర్ జలాశయం, పులిచింతల, ప్రకాశం బ్యారేజీల నుంచి నీటి ప్రవాహం అసాధారణంగా దిగువకు వస్తోంది. గంటకో విధంగా పెరిగిపోతూ పరవళ్ళు తొక్కుతున్న కృష్ణమ్మ లంక గ్రామాలపై విరుచుకపడింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ధాటికి కృష్ణమ్మ మహోగ్రరూపం దాల్చడంతో ప్రకాశం బ్యారేజీ దిగువన ఉన్న లంక గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. కట్టలు తెంచుకునేంత ఉగ్రరూపం దాల్చి కృష్ణా కుడి కరకట్టను తాకింది. బ్యారేజ్ దిగువున రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోన్నది.

రాత్రికి బుడమేరు, మున్నేరు వాగుల నుంచి వరద ప్రవాహం మరింతగా వచ్చి చేరే అవకాశం ఉండటంతో నీటి విడుదల 10.50 లక్షల క్యూసెక్కులకు చేరుకునే అవకాశం ఉందని కృష్ణానది సంరక్షక విభాగం అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద సాధా రణ రోజుల్లో 11 నుంచి 12 అడుగుల మాత్రమే ఉండే నీటిమట్టం ఇప్పుడు 19.5 అడుగులకు చేరింది. ఇది మరింతగా పెరిగే అవకాశం ఉన్నది. సోమవా రానికి పది లక్షల క్యూసెక్కుల వరద బ్యారేజీ దిగువకు రావొచ్చన్న అంచనాల నేపథ్యంలో సహాయక చర్యలపై అప్రమత్తంగా ఉండేలా సిబ్బందిని అధికారులు ఆదేశిం చారు. కృష్ణానది కుడి కరకట్ట కొన్నిచోట్ల కిందకు జారిపోయి భయపెడుతుంది. మరికొన్ని చోట్ల కట్టలు కోతకు గురై ప్రమాదాన్ని తలపిస్తుంది. 2009లో కృష్ణా నది పోటెత్తిన వరద పరిస్థితులు మళ్లీ పునరావృతం అయ్యేలా ఉన్నాయని లంక గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. భారీ వర్షాల ధాటికి పొంగి పొర్లుతున్న వరద ఉధృతిని సీఎం చంద్రబాబు విజయ వాడ నుంచి వస్తూ వారధిపై ఆగి హోంమంత్రి అనితతో కలసి ప్రవా హాన్ని పరిశీలించారు. బీజేపీ ఏపీ అధ్య క్షురాలు, ఎంపీ పురందేశ్వరి బ్యారేజిపై ఆగి వరద ఉధృతిని పరిశీలించారు. మంత్రులు లోకేశ్ మంగళగిరి పరిధిలో నాదెండ్ల మనోహర్ కొల్లిపర మండలంలోని అన్నవరపు లంకలో పర్యటించారు. కొల్లూరు మండలం పెసర్లంక అరవింద వారధి గండి వద్ద పోసిన కట్టను పరిశీలించారు. లంక గ్రామాల్లో పర్యటించి 10.50 లక్షల క్యూసెక్కుల వరకు వరద వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రజలంతా గ్రామాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు తరలి రావాలని సూచించారు. కొల్లూరు మండలం పెసర్లంక అరవింద వారధి ఎగువన గండి వద్ద పోసిన కట్టపై నుంచి వరద నీరు పొంగి పొర్లడం, క్రమేపి వరద ఉధృతి ఎక్కువ కావడంతో కట్ట కోతకు గురై ఒక్కసారిగా నీరు పెసర్లంక వైపు విరుచుకుపడి క్షణాల్లో కొల్లూరు కరకట్టను తాకింది. మధ్యలో నక్కపాయ వద్ద రహదారి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. కొల్లూరు కరకట్ట దిగువన లంక గ్రామాలకు వెళ్లే రహదారిపై సైతం వరద నీరు ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలను పోలీసులు నిలిపి వేశారు.

చెరువులను తలపిస్తోన్న చేలు

భారీ వర్షాలు, వరదతో పొలాలు కూడా ముంపునకు గురయ్యాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పొలాల్లో నీరు బయటకు పోయే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలా చోట్ల పైర్లు పూర్తిగా నీటమునిగి పొలాలు చెరువుల ను తలపిస్తుండడంతో నష్టం అంచనాపై ఇంకా కచ్చితమైన అంచనాలను వ్యవసాయ శాఖ వెల్లడించలేక పోతోంది. నాట్లు వేసిన వరి పొలాలు కూడా నీటిలో నానుతున్నాయి. మిరప, పత్తి తదితర పంటలు ఉరకెత్తే ప్రమాదం నెలకొంది. పత్తి, మిరప, పొగాకు,వరి, కంది పంటలకు భారీగానే నష్టం వాటిల్లింది. రేపల్లె, నగరం, కొల్లూరు, బాపట్ల, కర్లపాలెం, చెరుకుపల్లి పరిధిలో పైర్లకు భారీగా నష్టం వాటిల్లింది.

గేట్లెత్తేశారు..

నాగార్జునసాగర్ జలాశయానికి రికార్డు స్థాయిలో వరద నీరు వచ్చిచేరుతోంది. 5,61,364 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా అన్ని క్రస్ట్ గేట్లను 15 అడు గుల మేర ఎత్తి 5,77,786 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భారీగా నీటి విడుదలతో జలాశయం దిగువ ప్రాంతవాసులను అధికారులు అప్రమత్తం చేశారు. సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీల నుంచి నీటి విడుదల ఇంకా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. సాగర్‌లో ప్రస్తుతం 308.17 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పులిచింతలకు 6,84,800 లక్షల క్యూసెక్కుల వరద చేరుతుండగా ప్రకాశం బ్యారేజ్‌కు 6,74,800 కూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ ఎగువున ఉన్న డ్యాంలతో పాటు మున్నేరు, బుడమేరు వాగుల నుంచి ఉధృతంగా వరద ప్రవహిస్తుండటంతో ప్రమాదకర పరిస్థితి నెలకొన్నది. ఆదివారం మధ్యాహ్నం వరకు 7 లక్షల క్యూసెక్కుల వరకు వస్తున్న వరద సాయంత్రానికి అది 9.2 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. మునేరు నుంచి 2.40 లక్షలు, పాలేరు నుంచి మరో 70 వేల క్యూసెక్కుల వరద బ్యారేజికి వచ్చి చేరుతోంది. దీంతో శనివారం నుంచే బ్యారేజి దగ్గర 70 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టే సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఆది వారం మధ్యాహ్నానికి వరద పెరిగి ఒకేసారి 8.27 లక్షల క్యూసెక్కులకు చేరింది. మునేరు నుంచి వచ్చే వరద 3 లక్షలకు చేరుతుందనేది నీటిపారుదల శాఖ అధికారుల అంచనా. సోమవారం ఉదయానికి 10.50 లక్షల క్యూసెక్కులకు పైగానే వరద పెరి గే ప్రమాదం ఉంటుందని అంచనా.

అరవింద వారధి వద్ద గండి..



అరవింద వారధి వద్ద వరద ఉధృతి పరిశీలిస్తున్న మంత్రి మనోహర్, ఎస్పీ తుషార్‌డూడీ

అరవింద వారధి దగ్గర నక్కపాయకు వేసిన అడ్డుకట్టకు గండి పడటంతో నీరంతా పల్లపు భూముల్లోకి చేరింది. ప్రవాహ ఉధృతితో అడ్డగండీ దగ్గర రోడ్డు మార్గానికి కోతపడింది. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలో దాదాపు 24 గ్రామాల ప్రజలకు వరద ముంపు పొంచి ఉంది. కొల్లూరులో శనివారం అర్ధ రాత్రి నుంచి కలెక్టర్ వెంకటమురళితో పాటు స్పెషల్ ఆఫీసర్ శేషగిరిబాబు, ఎస్పీ తుషార్ డూడీ మకాం వేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కృష్ణానది తీవ్రరూపం దాల్చడంతో జిల్లాలోని లంకగ్రామాలు వరద గుప్పిట్లో చిక్కుకోవడంతో పరిస్థితిని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదివారం రాత్రి బాపట్లలోనే ఉండి సమీక్షించారు. వారధి వద్ద గండిపడడంతో చుట్టూ ఉన్న గ్రామాలకు పెను ముప్పు నెలకొని ఉండడంతో ఏ క్షణాన ఏం జరుగుతోందనన్న ఆందోళనలో ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు. లంకల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి 20 కేంద్రాలను సిద్ధం చేసి, వాటిలో 20,000 మంది ఉండేలా చర్యలు చేపట్టారు. వరద ప్రభావితమయ్యే లంక గ్రామాల పరిధిలో 40 జనరేటర్లను సిద్ధం చేశారు. రహదారుల కోతతో ప్రజలను, నిత్యావసరాలను తరలించడానికి 40 బోట్లు సిద్ధంగా ఉంచారు. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని దాదాపు 30 గ్రామాలకు వరద ముంపు పొంచి ఉండడంతో వారిని అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రేపల్లె మండల పరిధిలోని పెనుమూడి, బొబ్బర్లంక, లంకెవానిదిబ్బ గ్రామాలకు చెందిన 350 మందిని ఇప్పటికే శిబిరాలకు తరలించారు.

అర్ధరాత్రికి నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తదనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 48,000 ఎకరాల్లో పంట నీటమునిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కర్లపాలెం మండల పరిధిలో ముంపు బారిన పడిన పొలాలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు లంకల్లో వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కొల్లూరు మండలం ఈపూరులంక దగ్గర చప్టాపైకి వరద నీరు చేరింది. వరద డ్యూటీ వేసిన వారిలో ఇద్దరు అధికారులు కనిపించకపోవటంతో కలెక్టర్ వారి సస్పెన్షన్‌కు ఆదేశాలు జారీ చేశారు. మరో 8 మందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొల్లిపర మండలం వల్లభాపురం దగ్గర నది మధ్యలో దిబ్బలపై గొర్రెలతో చిక్కుకుపోయిన కాపరులను పోలీసులు పడవల సాయంతో గట్టుకు తీసుకొచ్చారు. కొల్లూరు మండలం రావిలంక నది మధ్యలో చిక్కుకున్న 30 మందిని కృష్ణా జిల్లా వెలువోలుకు తరలించారు. బాపట్ల మండలం నందిరాజుతోట-హైదర్‌పేట మధ్య నల్లమడ డ్రెయిన్‌పై ఉన్న పాతబ్రిడ్జి వరద ఉధృతికి కిందకు కుంగింది. సంతమాగులూరు మండల పరిధిలోని చవిటిపాలెం, గురిజేపల్లి మధ్యలో ఉన్న బ్రిడ్జిపై వరద ప్రవాహంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు స్థంబించాయి.

● బాపట్ల జిల్లాకు ఆరెంజ్ హెచ్చరిక

గుంటూరు, పల్నాడుకు రెడ్‌అలర్ట్

వర్షం తెరిపిచ్చింది కదా అని గుంటూరు, పల్నాడు ప్రజలు ఊపిరి పీల్చు కుంటున్న తరుణంలో వాతావరణ శాఖ పిడుగు లాంటి హె చ్చరిక జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం శనివా రం అర్ధరాత్రి కళింగపట్నం సమీపంలో తీరం దాటిన విషయం తెలిసిందే. అయితే తీరం దాటిన తర్వాత ఈ వాయుగుండం జగదల్‌పూర్‌కు ఆగ్నేయంగా 60 కిలోమీటర్లు, విశాఖకు వాయువ్యంగా 120 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది క్రమంగా దక్షిణ ఒడిశా- విదర్భ చేరుకుని బలహీనపడుతుందని అధికారులు తెలిపారు. ఈ ప్రభావంతో ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా సోమవారం విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు ప్రకటించారు. దీంతో గుంటూరు, పల్నాడు జిల్లాలకు రెడ్ అలర్ట్, బాపట్ల జిల్లాకు ఆరెంజ్ అలర్ట్‌ని జారీ చేశారు. తీరం వెంట బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. ఈ కారణంగానే ప్రభుత్వం స్కూళ్లు, కళాశాలలకు సోమవారం సెలవు దినాన్ని ప్రకటిం చినట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఏ ఒక్క ప్రైవేట్ పా ఠశాల నిర్వహించకూడదని ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.



భట్టిప్రోలు లంక గ్రామాల్లో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ కృష్ణ ప్రసాద్

పలు రైళ్లు దారిమళ్లింపు.. కొన్ని రద్దు

గంటల తరబడి రెగ్యులర్ రైళ్లు ఆలస్యం

భారీ వర్షాలు, ముంచెత్తుతోన్న వరదతో కొన్ని రైళ్లను దారిమళ్లించగా, మరి కొన్నింటిని అధికారులు ఏకంగా రద్దు చేశారు. పలు రైళ్లను గుంటూరు డివిజన్ పరిధిలోని నడికుడి మార్గంలో దారి మళ్లించారు. ఖమ్మం, వరంగల్ జిల్లా ల్లో మెయిన్ లైన్ దెబ్బతినడంతో దూర ప్రాం తాలకు వెళ్లాల్సిన, అక్కడి నుంచి వస్తున్న రైళ్లను విజయవాడ నుంచి గుంటూరు మీదగా దారి మళ్లిం చారు. కొన్నింటిని అయితే జగ్గయ్యపేట నుంచి మేళ్లచెరువు మీదగా విష్ణుపురం తీసుకొచ్చి అక్కడి నుంచి గుంటూరు, సికింద్రాబాద్ వైపుకు మళ్లించారు. దీంతో ఆదివారం ఈ మార్గం 200 శాతం కెపాసిటీని దాటింది. 11019 సీఎస్ఎంటీ ముం బై - భువనేశ్వర్, 11020 భువనేశ్వర్ - సీఎస్ఎంటీ ముంబై, 18519 విశాఖపట్టణం - ఎల్‌టీటీ రైళ్లను పగడిపల్లి, నడికుడి, గుంటూరు మార్గంలో నడిపింది. 12709 గూడూరు - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని మహబూబాబాద్-పగిడిపల్లి మీదగా సికింద్రా బాద్‌కు, 12749 మచిలీపట్నం - బీదర్, 12763 తిరుపతి - సికింద్రాబాద్, 12861 విశాఖ- మహబూబ్‌నగర్, 12699 చెన్నై- చాప్రా, 12737 కాకినాడపోర్టు - లింగంపల్లి, 12760 హైదరాబాద్ - తాంబరం, 12862 మహబూబ్ నగర్ - విశాఖ, 12740 సికింద్రా బాద్ - విశాఖ, 12968 జైపూర్ - చెన్నై సెంట్రల్ రైళ్లను కూడా ఈ మార్గంలోనే దారి మళ్లించారు. దీంతో ఈ మార్గంలో రెగ్యులర్ రైళ్ల గంటల తరబడి ఆలస్యంగా గమ్య స్థానాలకు చేరుకున్నాయి.

నేడు నాలుగు ఎక్స్‌ప్రెస్‌ల రద్దు

సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు రాకపోకలు సాగించే గోల్కొండ, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను సోమవారం పూర్తిగా రద్దు చేశారు. 12787 నరసపూర్ - నాగర్‌సోల్, 18046 హైదరాబాద్ - షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లను సోమవారం గుంటూరు మీదగా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. 17255 నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్, 17016 సికింద్రాబాద్ - భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌లను ఆదివారం రెండు గంటల ఆలస్యంగా రీషెడ్యూల్ చేశారు. విజయవాడలో రైలు పట్టాలు దెబ్బతిన్న కారణంగా మచిలీపట్నం - ధర్మవరం, నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌లను ఆది, సోమ వారాల్లో రద్దు చేశారు. ఈ నెల 2,3 తేదీల్లో 07783 విజయవాడ - గుంటూరు, 07779 గుంటూరు - మాచర్ల, 07580 మాచర్ల - నడికుడి, 07579 నడికుడి-మాచర్ల, 07780 మాచర్ల-గుంటూరు, 07788 గుంటూరు - విజ యవాడ, 07276 కాచీగూడ - మిర్యాలగూడ, 07277 మిర్యాలగూడ - నడికుడి రైళ్లను రద్దు చేశారు. ఈ నెల 2, 3, 4 తేదీల్లో 07973 నడికుడి - మిర్యాలగూడ, 07974 మిర్యాలగూడ - నడికుడి రైళ్లను కూడా రద్దు చేశారు.



లంక గ్రామాల ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి



లంక గ్రామాల్లో అరటి గెలలను ఒడ్డుకు చేర్చుకుంటున్న రైతు





● కంద, అరటి అంతర్‌పంటలో చేరిన వరద నీరు

బాపట్ల జిల్లాలో.. 105 మీమీ

జిల్లాలో ఆదివారం సాయంత్రానికి సగటు వర్షపాతం 105 మీమీ నమోదు కాగా మొత్తంగా 2700 మిల్లీమీటర్ల వర్షం పడింది. మండలాల వారీగా వర్షపాతం..

• చుండూరు	172.4
• నగరం	143.4
• సంతమాగులూరు	122.6
• అమర్తలూరు	139
• వేమూరు	118.4
• కొల్లూరు	107.4
• చెరుకుపల్లి	108.4
• పిట్టలవానిపాలెం	105.4
• కర్లపాలెం	142.2
• నిజాంపట్నం	116.2
• కారంచేడు	102.8
• అద్దంకి	111.4
• వేటపాలెం	117
• బాపట్ల	84.6



● రేపల్లె: మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయంలో భారీగా చేరిన వరదనీరు



బాపట్ల మండలం మూలపాలెం గ్రామంలో నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



చెరుకుపల్లి : చెరువులను తలపిస్తున్న వరినాటిన పంటపొలాలు



కర్లపాలెం: దమ్మనవారిపాలెంలో పాడైపోయిన వరిపైరును చూపిస్తున్న రైతులు

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
సోమవారం • 2 సెప్టెంబరు 2024
cinema@andhrajyothy.com





బాలయ్యతో కలసి ఓ ఫ్యాక్షన్ సినిమా చేయాలని ఉంది

నందమూరి బాలకృష్ణ నటుడిగా సినీ ఇండస్ట్రీలో యాభై వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర పరిశ్రమ, అభిమానులు కలసి ఆదివారం బాలయ్య సినీ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నోవాటెల్ ఆడిటోరియమ్ వేదికగా జరిగిన ఈ వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.దీనికి నందమూరి కుటుంబ సభ్యులతో పాటు మెగాస్టార్ చిరంజీవి, కమల్‌హాసన్, మోహన్‌బాబు, వెంకటేశ్, టి. సుబ్బరామిరెడ్డి, రఘు రామ కృష్ణం రాజు, కె. రాఘవేంద్రరావు, మురళీమోహన్, విజయేంద్ర ప్రసాద్, అశ్వినీదత్, సుహాసిని, మంచు విష్ణు, మాలాశ్రీ, నవీన్, రవి శంకర్, గోపీచంద్, బోయపాటి శ్రీను, పి.వాసు, జయసుధ కుటుంబం, విశ్వక్ సేన్, తదితరులు పాల్గొన్నారు. కన్నడ పరిశ్రమ నుంచి శివ రాజ్ కుమార్, ఉపేంద్ర కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'తెలుగు చిత్ర పరిశ్రమ అంతా కలిసి ఇలా వచ్చినందుకు అభినందిస్తున్నాను. 110 సినిమాలు చేయడం చాల కష్టం, మీరు 50 ఏళ్ల నుంచి సినిమాలు చేసినందుకు అభినందనలు. మీకు ఓపిక ఉన్నంత వరకు, ఊపిరి ఉన్నంత వరకు మీరు సినిమాలు చేయాలి. మేము అంతా మీతో ఉంటాం. జై బాలయ్య అనేది ఒక మంత్రం, అందులో ఉన్నంత ఎనర్జీ ఇంకా ఇక్కడ ఉండదు' అన్నారు. ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ 'బాలకృష్ణగారితో అసెంబ్లీలో కూర్చుంటూ ఉంటాం. ఇప్పుడు ఈ ఫంక్షన్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో వరదల కారణంగా ముఖ్యమంత్రిగారు రాలేకపోయారు. ఆయన తరఫున నేను వచ్చాను. బాలయ్య గారు సినిమా రంగంలో, వైద్య సేవ రంగంలో, రాజకీయ రంగంలో ఇలాగే కొనసాగాలి అని, దేవుడు మిమ్మల్ని నిండు నూరేళ్ళు చల్లగా ఉండేలా దీవించాలని కోరుకుంటున్నాను' అన్నారు. చిరంజీవి మాట్లాడుతూ 'ఇది బాలయ్యకు మాత్రమే కాదు తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన వేడుక.



చిరంజీవి

అరుదైన రికార్డ్‌ను బాలయ్య సొంతం చేసుకున్నందుకు ఆనందంగా ఉంది. ఎన్టీఆర్‌గారికి ప్రజల మదిలో ప్రత్యేక స్థానం ఉంది. బాలకృష్ణ తండ్రి చేసిన పాత్రలు సైతం చేసి ప్రేక్షకులను మెప్పించడం సామాన్యమైన విషయం కాదు. నేను ఇంద్ర సినిమా చేయడానికి కారణం బాలకృష్ణ చేసిన 'సమరసింహారెడ్డి' చిత్రం. బాలయ్యతో కలసి ఓ ఫ్యాక్షన్ సినిమా చేయాలన్నది నా కోరిక' అన్నారు.

కమల్ హాసన్ మాట్లాడుతూ 'అందరినీ గుర్తుపెట్టుకుని పలకరించే సంస్కారం ఉన్న వ్యక్తి బాలయ్య. ఆయనకు తండ్రి, దైవం, గురువు ఒక్కరే.. ఎన్టీఆర్ గారు. బాలయ్య అంటే స్వచ్ఛమైన మనసు, స్వేచ్ఛగా ఉండే మనిషి. ఆయన నిండు నూరేళ్ళు ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో బావుండాలి అని కోరుకుంటున్నాను' అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'బాలయ్య గారు మీరు యాభై ఏళ్లు ఇలా నటనా రంగంలో ఉండటం, వైద్య రంగంలో ఇలా సేవ చేయడం మేము చూస్తూనే పెరిగాం. నాకు తెలిసిన వాళ్ళు కూడా మీ ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. మీరు ఎప్పుడూ ఇలాగే నవ్వుతూ ఉండాలి' అన్నారు.






2019 నాటి సబ్ కమిటీ నివేదికను బయటపెట్టండి

- తెలంగాణ ప్రభుత్వాన్ని కోరిన సమంత
- మద్దతు పలికిన సినీ ప్రముఖులు

లింగవివక్ష, మహిళలపై లైంగిక వేధింపులపై మాలీవుడ్ చిత్ర పరిశ్రమ అట్టుడుకుతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ప్రకంపనలు క్రమంగా తెలుగు చిత్రపరిశ్రమను కూడా తాకుతున్నాయి. జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెలువడిన నేపథ్యంలో చిత్ర పరిశ్రమలోని మహిళలపై వేధింపులను నిరసిస్తూ టాలీవుడ్ కథానాయిక సమంత మరోసారి గళం విప్పారు. టాలీవుడ్‌లో మహిళలపై జరుగుతున్న వేధింపులపై 2019లో ఏర్పాటు చేసిన సబ్ కమిటీ నివేదికను ఇప్పుడు బయటపెట్టాలని ఆమె తెలంగాణ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. దాన్ని బహిర్గతం చేయడం వల్ల తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను అరికట్టేందుకు అవసరమైన విధి విధానాలను రూపొందించడంలో ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. వాయిస్ ఆఫ్ ఉమెన్ ఇన్ టీఎఫ్ఐ పేరుతో ఆమె సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. ఇండస్ట్రీలో మహిళా సమానత్వం, సురక్షితమైన పని వాతావరణాన్ని సృష్టించడం చాలా ముఖ్యం అని సమంత అభిప్రాయపడ్డారు. ఆ దిశగా అందరూ కలసి కృషి చేయాలని కోరారు. నటి మంచు లక్ష్మి, దర్శకురాలు నందినిరెడ్డి, గాయని చిన్మయి శ్రీపాద యాంకర్ సుమ కనకాల సహా పలువురు నటీనటులు సమంత సందేశాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసి ఆమెకు మద్దతు తెలిపారు.

ఆ నివేదికలో ఏముంది?

2018లో నటి శ్రీరెడ్డి మహిళల పట్ల ఇండస్ట్రీ వివక్ష చూపుతోందంటూ ఫిల్మ్ ఛాంబర్ వద్ద నగ్నంగా నిరసన ప్రదర్శనకు దిగారు. ఆ ఘటన నేపథ్యంలో 2019లో సీనియర్ ప్రభుత్వ అధికారులు, పోలీసులు, పౌర సమాజ ప్రతినిధులతో ప్రభుత్వం ఓ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. లైంగిక వేధింపులు, లింగ వివక్ష, వేతనాలు సహా పలు సమస్యలపై ఇండస్ట్రీలోని సంఘాలతో చర్చించిన కమిటీ 2022లో ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అయితే ఇప్పటివరకూ దాన్ని ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. కానీ మీడియాలో ప్రచారం జరిగిన దాని ప్రకారం... మహిళలను వేధించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించడం ఇండస్ట్రీలో సాధారణంగా మారింది. అలాగే నైట్ షిఫ్ట్‌లో పనిచేసేవారికి రవాణా సదుపాయం కల్పించడం లేదు. వేధింపులపై నోరు విప్పిన వారిని దోషుల్లా చూస్తున్నారు. యూనియన్ సభ్యత్వాల విషయంలో మహిళల పట్ల వివక్ష చూపుతున్నారు. చాలా యూనియన్లలో మహిళల సభ్యత్వం నాలుగు శాతానికి మించలేదు. దళారీ వ్యవస్థను ఉపయోగించుకొని నిర్మాతలు తక్కువ పారితోషికాలతో పని చేయించుకుంటున్నారు. డాన్స్, యాక్టింగ్ స్కూల్స్ నుంచి వచ్చే అమ్మాయిలను దళారులు లక్ష్యంగా చేసుకుంటున్నారు. పని ప్రదేశాల్లో మహిళల సంరక్షణ కోసం ఉద్దేశించిన చట్టాలను పరిశ్రమలోని సంస్థలు అమలు చేయడం లేదు, ఫిర్యాదుల స్వీకరణకు అంతర్గతంగా కమిటీలను ఏర్పాటు చేయాలని, అందులో మహిళలు సభ్యులుగా ఉండేలా చూడాలని కమిటీ నివేదికలో పేర్కొన్నట్లు అప్పట్లో మీడియాలో ప్రచారం జరిగింది.

ఆ దిశగా ముందడుగు వేద్దాం

ఇండస్ట్రీలో మహిళల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, పరిశ్రమ సంఘాలు కలసి రావాలని సమంత అభ్యర్థించారు. సినీ ఇండస్ట్రీలోని పని ప్రదేశాల్లో లింగ వివక్ష ఏ రూపంలో ఉన్నా అరికట్టాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. హేమ కమిటీ నివేదికను ఉదహరిస్తూ పలు సూచనలు చేశారు. ఆ నివేదిక వచ్చాక చిత్ర పరిశ్రమలోని మహిళల్లో ధైర్యం వచ్చిందన్నారు. పని ప్రదేశాల్లో తాము ఎదుర్కొంటున్న వివక్ష, దోపిడీని ప్రశ్నించేందుకు మరింత మంది మహిళలు తమ మౌనం వీడి ముందుకు రావడం మంచి పరిణామం అని చెప్పారు. లింగ అసమానతను అరికట్టేందుకు పారదర్శకమైన వ్యవస్థను కమిటీ సిఫారసు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తదనుగుణంగా లింగ వివక్ష లేని వాతావరణాన్ని పరిశ్రమలో కల్పించేందుకు ప్రభుత్వం, మూవీ ఆర్గనైజేషన్లు కలసి పనిచేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఆ దిశగా పునరాలోచిద్దాం, పునర్నిర్మిద్దాం, ముందడుగు వేద్దాం అని సమంత చెప్పారు.

సినిమా బతకాలి

మాలీవుడ్‌ను పవర్ సెంటర్ నియంత్రిస్తుందన్న హేమ కమిటీ వ్యాఖ్యలను నటుడు మమ్ముట్టి ఖండించారు. అలాంటిదేమీ ఇండస్ట్రీలో లేదు అని వివరణ ఇచ్చారు. అంతిమంగా సినిమా బతకాలనేదే తన కోరిక అని చెప్పారు. ఆయన ఆదివారం సోషల్ మీడియాలో స్పందించారు. 'నివేదిక కోర్టు ముందు ఉంది, నిందితులకు కోర్టు శిక్షలు నిర్ణయిస్తుందని చెప్పారు. షూటింగ్ ప్రదేశాల్లో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు కమిటీ చేసిన సూచనలను స్వాగతిస్తున్నాను, వాటి అమలు కోసం పరిశ్రమలోని అన్ని సంఘాలు ఏకతాటిపైకి రావాలి, మహిళలకు ఇబ్బందికర పరిస్థితులు రాకుండా దర్శక నిర్మాతలు జాగ్రత్తలు తీసుకోవాల'ని సూచించారు. హేమ కమిటీ నివేదిక గురించి స్పందించాలని మీడియా కోరగా దాని గురించి తనకేం తెలియదని రజనీకాంత్ బదులిచ్చారు.

భయపడేది లేదు

నటుడు జయసూర్య తనను వేధించాడంటూ నటి సోనియా మల్హర్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదైంది. అయితే ఆ ఆరోపణల్లో నిజం లేదని జయసూర్య ఓ ప్రకటనలో తెలిపారు. తనపై తప్పుడు కేసు పెట్టిందని ఆరోపించారు. న్యాయం కోసం పోరాడుతానని చెప్పారు. దీనిపై సోనియా ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరింపులకు భయపడేది, లేదు నా వ్యాఖ్యలను వెనక్కు తీసుకునేది లేదు అని తెగేసి చెప్పారు. తను చెప్పిన ప్రతి అంశం నిజమేనని పేర్కొన్నారు.

రిలీజ్ డేట్ మారింది



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటించిన 'భలే ఉన్నాడే' చిత్రం ఈ నెల 7న విడుదల కావాలి. అయితే అనివార్యకారణాల వల్ల విడుదల తేదీని వాయిదా వేసినట్లు, 13న రిలీజ్ చేస్తామని చిత్ర నిర్మాత ఎన్.వి కిరణ్‌కుమార్ చెప్పారు. దర్శకుడు మారుతి సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివ సాయి వర్థన్ దర్శకుడు. సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఈ సినిమాలో కీలక పాత్ర పోషించారు. అమ్మాయిలకు అందంగా అలంకరణలను చేసే పాత్రను ఇందులో రాజ్‌తరుణ్ పోషించారు. శేఖర్ చంద్ర సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి నగేశ్ బానెల్లా ఛాయాగ్రాహకుడు.

రెండు ముఖాలు



నిఖిల్ దేవాదుల హీరోగా నటిస్తున్న 'ఘటికాచలం' చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఇందులో హీరో రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తున్నారు. ఒక లుక్ ఇన్నోసెంట్‌గా, మరో లుక్ ఇంటెన్స్‌గా ఉంది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో ఈటీవీ ప్రభాకర్, ఆర్వికా గుప్తా, జోగినాయుడు, సంజయ్‌రాయ్, దుర్గాదేవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. అమర్ కామెపల్లి దర్శకుడు. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తామని చిత్రకథకుడు, నిర్మాత ఎం.సి.రాజు చెప్పారు.

మన బతుకులు కలలు కావు.. కళలు



దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలు పోషించిన 'ఉత్సవం' సినిమా థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేశారు. హాస్యనటుడు బ్రహ్మానందం స్టేజ్ ప్లేలోని పవర్‌ఫుల్ డైలాగుతో ట్రైలర్ మొదలైంది. 'మన బతుకులు కలలు కావు.. కళలని గుర్తించే రోజులు రావా' అని ప్రకాశ్‌రాజ్ చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది. దిలీప్, రెజీనాల లవ్‌ట్రాక్ ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ. నాటకాలు అంటే ఇష్టపడే యువతిగా రెజీనా నటించారు. ఈ నెల 13న విడుదలయ్యే 'ఉత్సవం'లో నాజర్, రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, అలీ, ప్రేమ, ఎల్బీ శ్రీరామ్ తదితరులు నటించారు. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ ఈ సినిమాను నిర్మించారు.



సున్నా నుంచి 35 మార్కులు

నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజా ప్రధాన పాత్రలు పోషించిన '35.. చిన్న కథ కాదు' చిత్రం ట్రైలర్‌ను అక్కినేని నాగార్జున ఆదివారం విడుదల చేశారు. లెక్కల సబ్జెక్ట్‌తో ఇబ్బంది పడుతున్న ఓ స్టూడెంట్‌ను పరిచయం చేస్తూ ట్రైలర్ మొదలైంది. ఆ పిల్లాడి తల్లితండ్రులుగా నివేద, విశ్వదేవ్ నటించారు. కొడుకు భవిష్యత్ గురించి ఆందోళన చెందుతుంటారు. ఆ పిల్లాడిని టీచర్, క్లాసులో ఇతర స్టూడెంట్స్ 'సున్నా' అని పిలుస్తూ అవహేళన చేస్తుంటారు. ఆ కుర్రాడు సవాళ్లను అధిగమించి, 35 మార్కులతో ఉత్తీర్ణత సాధించడం ఈ చిత్రకథ. దర్శకుడు నందకిశోర్ ఈమని ఆసక్తికరంగా రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదలవుతోంది. రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు.

తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు



హారర్ థ్రిల్లర్ 'డీమాంటీ కాలనీ 2' చిత్రాన్ని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు హీరో అరుల్ నిధి ధన్యవాదాలు తెలిపారు. ఆగస్టు నెలలో విడుదలైన ఈ చిత్రాన్ని బి.సురేశ్‌రెడ్డి, మానస రెడ్డి తెలుగు ప్రేక్షకులకు అందించారు. ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో అరుల్ నిధి మాట్లాడుతూ ' తమిళంలో మా సినిమా బాగా ఆడుతోంది. తెలుగులో నిర్మాత సురేశ్‌రెడ్డి బాగా ప్రమోట్ చేశారు. ఆయన వల్లే సినిమా ఇంత పెద్ద విజయం సాధించింది. త్వరలో హైదరాబాద్ వచ్చి సక్సెస్ మీట్ నిర్వహిస్తాం' అన్నారు. ఈ సినిమాకు మరో రెండు సీక్వెల్స్ వస్తాయనీ, 'డీమాంటీ కాలనీ 3' భారీ స్థాయిలో ఉంటుందని, ఇందులో ఊహించని మలుపులు ఉంటాయనీ అరుల్ నిధి చెప్పారు. 'ఈ సినిమా పార్ట్ వన్‌లో ఒక పాత్ర చేశాను. పార్ట్ 2 లో రెండు పాత్రలు పోషించాను. పార్ట్ 3లో దర్శకుడు అజయ్ ఎన్ని పాత్రలు చేయిస్తారో చూడాలి. ఇంతవరకూ ఎక్కువగా థ్రిల్లర్, సస్పెన్స్ మూవీస్ చేశాను. ఇకపై ఇతర చిత్రాల్లో కూడా నటించాలనుకుంటున్నాను' అని చెప్పారు అరుల్ నిధి.

ఇన్ ప్రోగ్రెస్

రెండేళ్ల కృషి ఫలించింది



యం.యన్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఇటీవల ఈ చిత్రం విడుదలై అందరినీ అలరిస్తున్న సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సాగర్ మాట్లాడుతూ 'రెండేళ్ల మా కృషి ఫలించింది. మా సినిమాకు స్పందన బాగుంది. స్టార్స్ లేకున్నా కొత్త నటీనటులను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. మా సినిమాలో హీరోయిన్లు ముగ్గురూ బాగా చేశారు. కిరాక్ కిరణ్ పాత్ర బాగా పండింది' అన్నారు. హీరోయిన్లు హన్వికశ్రీనివాస్, ఉమా రేచర్ల, శ్రుతీ శంకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పెనుమూడి వద్ద భారీగా చేరిన వరదనీటిని పరిశీలిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్

ప్రమాదభరితంగా కరకట్ట

రేపల్లె, సెప్టెంబరు 1: కృష్ణా నదికి వరద నీరు పోటెత్తటంతో తీర ప్రాంత ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. కృష్ణానదికి ఎగువ ప్రాంతం నుంచి ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పోటెత్తటంతో దిగువకు 9 లక్షలపైచిలుకు వరద నీరు వదలటంతో బలహీనంగా ఉన్న కరకట్టలను గత ప్రభుత్వం అభివృద్ధి చెయ్యకపోవటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని తీర ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఊళ్ళకు ఊళ్ళు పంట పొలాలు మునిగిపోయి కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లితుందని పలు గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే వరిసాగు చేసిన పొలాల్లో అత్యధికంగా నీరుచేరి వరిపైరు కుళ్ళిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతన్నలు తమ గోడును వెల్లగక్కుతున్నారు. గత ప్రభుత్వం కరకట్టను అభివృద్ధి చేస్తామంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇచ్చిందే గాని నెరవేర్చలేదని రేపల్లె,రూరల్‌మండల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. వరద ఉధృతంగా వస్తే కరకట్ట తెగిపోయి ఊళ్ళకు ఊళ్ళు మునిగిపోయే పరిస్థితి నెలకొంది. ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద నీరు ఉధృతంగా చేరటంతో దిగువకు 9 లక్షల 20వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణానది వెంబడి వరద నీరు పోటెత్తి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో భారీ స్థాయిలో వరద నీరు చేరుకుంటే ఎక్కడ కరకట్టకు గండి పడుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

గత ప్రభుత్వం కరకట్ట అభివృద్ధిని మరచింది...

కృష్ణానది కుడికట్ట వెడల్పు పనులు అరకొరగానే చేపట్టగా, కొన్నిచోట్ల గట్టు కిందకు జారిపోయి భయపెడుతుంది. మరికొన్ని చోట్ల కట్టలు కోతకు గురై ప్రమాదాన్ని తలపిస్తుంది. రూ. కోట్లాదిరూపాయలు ఉన్నా పనులు కాని వైనంపై విమర్శలు వెల్లువెత్తాయి. కృష్ణానది కుడికట్ట వెడల్పు చేసేందుకు 2008లో ప్రభుత్వం టెండర్లు పిలిచింది. అభివృద్ధి పనులు నిర్వహణలో భాగంగా పెనుమూడి నుండి అడవిపాలెం వరకు ఆరుకోట్లతో హైదరాబాద్‌కు చెందిన సంస్థ టెండర్ దక్కించుకుంది. అదేవిధంగా అడవిపాలెం నుండి లంకెవానిదిబ్బ వరకు కృష్ణా కరకట్టను బలపరిచేందుకు హైదరాబాద్‌కు చెందిన సంజీవరెడ్డి అనే గుత్తేదారుడు రూ.రెండు కోట్లకు టెండర్లు దక్కించుకున్నారు. అయితే ఈ పనులు 2009 ఆగస్టు నాటికి పూర్తి చేయాల్సి వుంది. అప్పటికే ఏ మాత్రం పనులు సాగకపోవటంతో గుత్తేదారుడు ప్రభుత్వానికి గడువు కావాలని కోరటంతో 2011 జూలై నాటికి పనులు పూర్తికావాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ అభివృద్ధి పనులు నేటికీ ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. పెట్రోలింగ్ నిర్వహించాల్సిన ఆర్‌సీ అధికారుల మాత్రం సిబ్బంది కొరత అంటూ కనీసం కరకట్ట పరిస్థితి గురించి ఆరా చేసిన అధికారులే లేరు. వర్షాకాలంలో ప్రతి రెండు రోజులకు కరకట్ట పరిస్థితిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు అందించాల్సిన అధికారులు పదమూడేళ్ళు గడుస్తున్నా పనులు చేయించకుండా పత్తా లేకుండా పోయారు. కాంగ్రెస్‌ప్రభుత్వంలో వరద ఉధృతంగా రావటంతో ఓలేరు వద్ద కరకట్ట తెగి రేపల్లెప్రాంతం నీటిమయంగా మారింది. అయితే నేటి పాలకులు ముందుగానే వరదనీటిని గమనించి గ్రామీణ ప్రాంతాలు దెబ్బతినకుండా సముద్రంలోనికి నీటిని సమన్వయంతో విడుదల చేశారు. వేలాది క్యూసెక్కుల నీటిని సముద్రానికి ప్రతిరోజు విడుదల చేస్తూ అధికారులచే కరకట్టల పరిస్థితిని తెలుసుకుంటూ నీటిని విడుదల చేస్తున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ కరకట్టల పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తూ నీటి ప్రవాహం సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.



రేపల్లె: చెరువులను తలపిస్తున్న వరి నాటిన పంట పొలాలు

తీరంలో.. భయం భయం

● ఉధృతంగా వస్తున్న వరదనీరు ● ప్రమాదభరితంగా కరకట్ట

రేపల్లె, సెప్టెంబరు 1: కృష్ణా నదికి వరద నీరు పోటెత్తటంతో తీర ప్రాంత ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. కృష్ణానదికి ఎగువ ప్రాంతం నుంచి ప్రకాశం బ్యారేజీకి వరద నీరు పోటెత్తటంతో దిగువకు లక్షలపైచిలుకు వరద నీరు వదలడంతో బలహీనంగా ఉన్న కరకట్టలను గత ప్రభుత్వం అభివృద్ధి చేయకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని తీర ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వరద ఉధృతంగా వస్తే కరకట్ట తెగిపోయి ఊళ్ళకు ఊళ్ళు మునిగిపోయే పరిస్థితి నెలకొంది. ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద నీరు ఉధృతంగా చేరటంతో దిగువకు 8లక్షల 20వేలక్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణానది వెంబడి వరద నీరు పోటెత్తి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో భారీ స్థాయిలో వరద నీరు చేరుకుంటే ఎక్కడ కరకట్టకు గండి పడుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరిసాగు చేసిన పొలాల్లో అత్యధికంగా నీరుచేరి వరిపైరు కుళ్ళిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. గత ప్రభుత్వం కరకట్టను అభివృద్ధి చేస్తామంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇచ్చిందేగాని నెరవేర్చలేదని రేపల్లె,రూరల్‌మండల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

ప్రజలకు సహాయసహకారాలు అందించండి
ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, సెప్టెంబరు 1: లంక గ్రామాల ప్రజలకు వరద వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులతో పాటుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సూచించారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతర వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి ఏడు లక్షల క్యూసెక్కుల దాటి వరద నీరు ప్రవహిస్తుండటంతో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని సూచించారు. ఈ రాత్రికి 10 లక్షల వరకు వరద పెరిగే అవకాశం ఉన్నందున వరద పెరిగితే లంక గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అధికారులంతా ఎప్పటికప్పుడు వరదను సమీక్షిస్తూ ప్రజలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. పరిశీలనలో ఆయనతో పాటు టీడీపీ మండల అధ్యక్షులు ఎం.మురళీకృష్ణ, నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త ఊసా రాజేష్, మాజీ ఎంపీపీ డాక్టర్ కె.మధుసూదన ప్రసాద్, త పాల్గొన్నారు.

ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలి: కలెక్టర్

కొల్లూరు, సెప్టెంబరు 1: కృష్ణానదికి వరద ఉధృతి పెరుగుతున్న దృష్ట్యా లంకగ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని జిల్లా కలెక్టర్ జి.వెంకటమురళీ సూచించారు. కృష్ణానదిలో వరద ఉధృతి పెరగడంతో జిల్లా ఎస్పి తుషార్‌డూడితో కలిసి శనివారం రాత్రి లంక గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివారం కూడా ఉదయాన్నే కొల్లూరు మండలంలోని అరవింద వారధి వద్ద వరద ఉధృతిని పరిశీలించినట్లు చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించడంతో పాటు ఎస్‌పితో కలిసి చిలుమూరులంకకి వెళ్ళిన ఆయన, ప్రజలకు వరద పరిస్థితిని వివరించి పునరావాస కేంద్రాలకు వెళ్లాలని, ముందస్తుగానే గ్రామాలను ఖాళీ చేయాలని గ్రామస్తులకు వివరించారు. గ్రామానికి చెందిన వృద్ధులు, బాలింతలు, గర్భిణులను ఆటోలో ఎక్కించి కొల్లూరులోని పునరావాస కేంద్రానికి పంపించారు.విధులలో అలసత్వం ప్రదర్శించిన కొంతమంది అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖా పరమైన చర్యలకు సిద్ధంకావాలని హెచ్చరించారు. కలెక్టర్, ఎస్‌పి కొల్లూరులోనే మకాం వేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి శేషగిరిబాబు, ఆర్డీవో షారోన్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముంపు రైతులను ఆదుకుంటాం: ధూళిపాళ్ల

పొన్నూరుటౌన్, సెప్టెంబరు1: భారీ వర్షాల వలన పంట నీట మునిగి దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుటుందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. పొన్నూరు మండలంలోని మాచవరం, ములుకుదురు, పచ్చలతాడిపర్రు, గోళ్లమూడిపాడు, బ్రహ్మణకోడూరు, వెల్లలూరు, చేబ్రోలు మండలంలోని వేజండ్ల, సుద్ధపల్లి, శేకూరు గ్రామాలో ఎమ్మెల్యే పర్యటించి ఆయా గ్రామాల్లో నీట మునిగిన వరి పైర్లు, ముంపునకు గురైన గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులను పిలిపించి తక్షణమే పంట నష్ట పరిహారంపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామంలో భారీ వర్షాల వలన కాల్వలో గల్లంతై మగ్గురు మృతి చెందటం ఆవేదన కలిగించిందన్నారు. జనసేన సమన్వయ కర్త వడ్రాణం మార్కండేయబాబు, కూటమి పార్టీల నాయకులు, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



కొల్లూరు: లంక గ్రామాల్లోని ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు



పొన్నూరు: సుద్దపల్లిలో ముంపు పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర



కొల్లూరు: వృద్ధులు, చిన్నారులు, గర్భిణులను ఆటోలో పునరావాస కేంద్రానికి తరలిస్తున్న కలెక్టర్

మీ బాధ ఎవరూ తీర్చలేనిది

● ఉప్పలపాడు వాగు ఘటనలో మృతి చెందిన చిన్నారుల కుటుంబీకులకు పెమ్మసాని పరామర్శ



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని

పెదకాకాని, సెప్టెంబరు 1: మీ బాధ ఎవరూ తీర్చలేనిది. స్కూల్ యాజమాన్యం బాధ్యత వహించాలి. ప్రైవేట్ స్కూళ్లల్లో నిర్వహణా లోపంపై చర్యలు తీసుకునే బాధ్యత నాది.' అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉప్పలపాడు గ్రామ శివారులోనీ వాగులో జరిగిన కారు ప్రమాదం తెలిసిందే. ఘటనలో మృతి చెందిన చిన్నారులు మాన్విక్ (9) కుటుంబాన్ని పెమ్మసాని ఆదివారం పరామర్శించారు. మాన్విక్ అమ్మమ్మ, తాతయ్యలతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. స్కూలుకు వెళ్లిన తమ మనవడిని తిరిగి ఇంటికి పంపించే క్రమంలో కనీసం సమాచారం ఇవ్వలేదని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఆరోపించారు. పిల్లల విషయంలో కనీస జాగ్రత్త కూడా తీసుకొని కారణంగానే ఈ ప్రమాదం ఎదురైందని కన్నీటి పర్యంతమయ్యారు. బాధలో ఉన్న కుటుంబీకులను ఓదార్చిన పిమ్మట పెమ్మసాని మాట్లాడుతూ ఈ బాధ ఎవరు తీర్చలేనిదని, ప్రైవేట్ స్కూళ్ల నిర్వహణపై తాను చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యం నుంచి సరైన కమ్యూనికేషన్ లేని కారణంగా ప్రమాదం ఎదురైనట్లుగా కుటుంబ సభ్యులు తనకు వివరించారని చెప్పారు. గుంటూరు ఛానల్ లీక్ అయిన కారణంగా వర్షం నీరు గ్రామాల్లోకి చేరుతుండటంపై అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. కాగా మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు నష్టపరిహారం కింద ప్రభుత్వం ప్రకటించిన రూ. 5 లక్షల చెక్కును పెమ్మసాని అందజేశారు. తహసీల్దార్ టి. కృష్ణ కాంత్, ఎంపీటీసీ మోపర్తి శ్రీనివాసరావు, సర్పంచ్ కర్నాటి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ దుద్దుకూరి బూషి బాబు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

ఉప్పలపాడు వాగు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు చిన్నారులు, ఉపాధ్యాయుని ఘటనపై గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. ప్రమాదానికి కారణమైన వాగు వద్ద వంతెన నిర్మాణానికి గానూ అధికారులకు పెమ్మసాని ఆదేశాలు ఇచ్చారు. ఏ స్థాయి వర్షాలు కురిసినా సరే, మరోసారి ప్రాణ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరి పైనా ఉందని చెప్పారు. ఉప్పలపాడు గొల్లమూడి గ్రామాల మధ్యన త్వరలో వంతెన నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభించాలని ఆయన సూచించారు. అలాగే వంతెన నిర్మాణానికి వి.వి.ఐ.టి కళాశాల యాజమాన్యం రూ. 50 లక్షలు సహకారం అందిస్తామన్నారని పెమ్మసాని తెలిపారు. అనంతరం వర్షాల కారణంగా ఉప్పలపాడు గ్రామంలో జరిగిన పంట నష్టాన్ని కూడా ఆయన పరిశీలించారు. వర్షాల కారణంగా హై లెవెల్ ఛానల్ పొంగి దాదాపు 5 వేల ఎకరాలకు పైగా పంట పొలాలు నీట మునిగాయని పెమ్మసాని వద్ద రైతులు వాపోయారు. గతంలో ఉన్న కల్వర్టు కూలిపోయిన తర్వాత తాము అందరం కలిసి తూములు ఏర్పాటు చేసుకున్నా ఉపయోగం లేకుండా పోయిందని చెప్పారు. తక్షణమే స్పందిస్తూ సంబంధిత శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లికార్జునరావు తో పెమ్మసాని ఫోన్లో మాట్లాడారు. కల్వర్టు నిర్మాణానికి సంబంధించిన డి.పి.ఆర్. త్వరగా సిద్ధం చేయాలని, ఎంపీ నిధుల ద్వారా వీలైనంత త్వరగా కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశించారు. ఎంపీటీసీ మోపర్తి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బూసి బాబు, కొర్రపాటి సాంబశివరావు, అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.



అరవిందవారిధి వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, సెప్టెంబరు 1: కృష్ణానదికి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందనీ, లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అన్నవరంలంక, కొత్తూరులంక, కనిగిరిలంక, పెసరలంక, ఈపూరులంక గ్రామాల్లో మనోహర్ అధికారులతో పాటు పర్యటించారు. వరద ఉధృతి పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. కృష్ణానదికి 9 లక్షల క్యూసెక్కుల పైగా వరదనీరు వచ్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టెలీకాన్ఫరెన్స్‌లో చెప్పారనీ, లోతట్టు ప్రాంతాలు లంక గ్రామాల్లో నీరు చేరతాయని అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు నిత్యవసర సరుకులు ప్రభుత్వం నుంచి అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారన్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరుగకుండా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నామన్నారు. తాను కూడా ప్రజలకు అందుబాటులో ఉంటున్నామన్నారు. ఎవరూ ఇబ్బంది పడకుండా అందుబాటులో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ పూర్ణశంకరరావు తదితరులు ఉన్నారు.

11 మండలాల్లో పునరావాస కేంద్రాల ఏర్పాటు

గుంటూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరద కారణంగా నిరాశ్రయులైన వారిని ఆదుకొనేందుకు జిల్లా యంత్రాంగం 11 మండలాల్లో పునరావాస కేంద్రాలను నెలకొల్పింది. ఆదివారం సాయంత్రానికే 1462 కుటుంబాలను ఆయా కేంద్రాలకు తరలించి వారికి ఆశ్రయం కల్పించింది. పెదకాకాని మండలంలోని నంబూరులో వేమన జడ్పీహెచ్‌ఎస్‌లో 52 కుటుంబాలు, పెదకాకాని లూథర్ గిరి కాలనీ స్కూల్‌లో 111 కుటుంబాలకు ఆశ్రయం ఏర్పాటు చేసింది. మేడికొండూరు మండలంలోని పాలడుగులో ఉన్న నాడు - నేడు స్కూల్‌లో ఒక కుటుంబానికి ఆశ్రయం కల్పించింది. తుళ్లూరు మండలంలోని ఉద్దండ్రాయుని పాలెంలో 45, వెంకటపాలెంలో 30, హరిశ్చంద్రాపురంలో 35, లింగాయపాలెంలో 26, తుళ్లూరులో 35, రాయపూడిలో 200, మందంలో 15, వట్టిచెరుకూరులో 19 కుటుంబాలకు ఆయా గ్రామాల్లోని ఎంపీయూపీ స్కూళ్లలో వసతి కల్పించారు. రాయపూడి లంక ప్రజలను ఇబ్రహీంపట్నంకు తరలించారు. తెనాలిలోని కొపల్లెలో 5, మంగళగిరిలోని ఆత్మకూరులో 5, తాడేపల్లి లోని మహానాడు-1లో 245, మహానాడు-2లో 260, వడ్డేశ్వరంలో 12, నులకపేటలో 45, దుగ్గిరాల ఈమనిలో 40, దుగ్గిరాలలో 24, పెదకొండూరులో 3, మంగళగిరి తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆరు శిబిరాలు ఏర్పాటు చేశారు. పొన్నూరులో 19 మందిని అక్కడి ఎలిమెంటరీ స్కూల్‌కు తరలించారు. పునరావాస కేంద్రాలకు జిల్లాస్థాయి అధికారులను ఇన్‌ఛార్జ్‌లుగా నియమించి భోజనం, తాగునీరు వంటి సదుపాయాలను కల్పిస్తున్నారు.

షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలి

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 1 : కొల్లిపర మండలం లోని 36 మంది సచివాలయ సిబ్బందికి సకాలంలో పెన్షన్లు పంపిణీ చేయలేదన్న కారణంతో జారీ చేసిన షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఉదయం వర్షం కురుస్తున్నందు వల్ల 36 మంది సచివాలయ ఉద్యోగులు 8 గంటల కే పెన్షన్ పంపిణీ మొదలు పెట్టలేదని అన్నారు. దాని నిమిత్తం అక్కడి ఎంపీడీవో షోకాజ్ నోటీసులు జారీ చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి కూడా వర్షం కారణంగా పెన్షన్లు పంపిణీ విషయంలో సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకురావద్దని చెప్పిన సంగతిని అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఎంపీడీవో జారీ చేసిన షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

లారీ, బైక్ ఢీ: ఒకరు మృతి

కర్లపాలెం, సెప్టెంబరు 1 : ద్విచక్రవాహనాన్ని లారీ ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెంది ఇరువురికి గాయాలైన సంఘటన కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ముకుందా టీస్టాల్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్సై రవీంద్ర కథనం ప్రకారం కర్లపాలెంకు చెందిన గాజుల బల వెంకట అమర్‌నాథ్, జిలానీ, ఉదయ్‌లు బాపట్ల నుంచి కర్లపాలెం వైపు బైక్‌పై వస్తున్నారు. కర్లపాలెం నుంచి బాపట్ల వైపు వెళుతున్న విజయవాడ సింగ్ నగర్‌కు చెందిన పార్శిల్ లారీ బైక్ ఢీ కొనడంతో బాల వెంకట అమర్‌నాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. జిలానీ, ఉదయ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. గాజుల బాల వెంకట అమర్‌నాథ్ తల నుజ్జునుజ్జు అయి మృతి చెందాడని, పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించినట్లు ఎస్సై చెప్పారు. ఉదయ్,జిలానీలను చికిత్స నిమిత్తం ఏరియావైద్యశాలకు తరలించామని ఎస్సై అన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



కరకట్ట వద్ద గండిని పూడుస్తున్న రైతులు



సీఎం నివాసానికి తుళ్లూరు ఎమ్మార్వో కార్యాయం నుండి ట్రాక్టర్‌తో తరలిస్తున్న ఇసుక

సీఎం చంద్రబాబు నివాసానికి వరద ముప్పు

● ఇసుక బస్తాల ఏర్పాటు

తుళ్లూరు, సెప్టెంబరు 1: తాడేపల్లి మండలం ఉండవల్లి కరకట్ట వద్ద నివాసం ఉంటున్న సీఎం చంద్రబాబు నాయుడు నివాసానికి వరద ముప్పు ఏర్పడిందని అధికారులు శనివారం రాత్రి గుర్తించారు ఆయన నివాసం ఒడ్డున కోత పడకుండా అందుకు ఇసుక బస్తాలను ఏర్పాటు చేస్తున్నారు. కృష్ణా నది వరద ఉధృతి కారణంగా ఎక్కడా ఇసుక లేకుండా పోవడంతో తుళ్లూరు ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న ఇసుక నిల్వల నుండి నాలుగు ట్రాక్టర్ల ఇసుకను రాత్రి 9 గంటల సమయంలో అత్యవసరంగా తరలించాల్సి వచ్చింది.

కరకట్టకు గండిపడే ప్రమాదం గుర్తించిన రైతులు

తుళ్లూరు: తుళ్లూరు మండలం మండలం వెంకటపాలెం మంతెన సత్యనారాయణ రాజు ఆరోగ్యాలయం వద్ద కృష్ణ కర కట్టకు గండిపడే ప్రమాదాన్ని రాజధాని రైతులు ఆదివారం అర్ధరాత్రి గుర్తించారు. ఒకరిద్వారా మరొకరు సమాచారం తెలుసుకుని రైతులు కట్ట మీదకు చేరుకుని గండి పూడ్చే పనులను స్వచ్ఛందంగా చేపట్టారు. అధికారులకు కూడా సమాచారం అందించడంతో వారు కూడా అక్కడకి తరలివచ్చారు. రైతులు స్పందించకుంటే వరద నీరు సీడ్ యాక్సిస్ రోడ్డుపైకి వచ్చేదని అధికారులు తెలిపారు.

కొండవీడులో విరిగిపడిన కొండచరియలు

● రెండు రోజులు ఘాట్ మార్గం మూసివేత



కొండవీడు ఘాట్‌రోడ్డు ముఖద్వారం సమీపంలో రోడ్డుకు అడ్డంగా జారిపడిన భారీ బండరాయి

కొండవీడుకోట(యడ్లపాడు), సెప్టెంబరు 1 : భారీ వర్షాల కారణంగా కొండవీడుకోట ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. ముఖద్వారం, మూల మలుపుల్లో కొండచరియలు విరిగి భారీ బండరాళ్ళు రోడ్డుపై అడ్డంగా పడ్డాయి. దీనితో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అప్రమత్తమైన అటవీశాఖాధికారులు కొండ దిగువన ఉన్న చెక్ పోస్టు వద్ద వాహనాలను నిలిపివేశారు. ఆర్అండ్‌బి అధికారుల సహకారంతో రోడ్డులో విరిగిపడిన కొండచరియలను రెండు రోజుల్లో తొలగిస్తామని జిల్లా అటవీశాఖాధికారి రామచంద్రరావు తెలిపారు. సోమ, మంగళవారాలు ఘాట్ రోడ్డును మూసివేస్తున్నామని కొండవీడుకు రావద్దని హెచ్చరించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

ముంపునకు గురైన పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, సెప్టెంబరు 1 : భారీ వర్షంతో పాటు ఎగువ ప్రాంతాలు నుంచి వస్తున్న వరద నీటి వల్ల బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలోని వరి పొలాలు నీటమునిగాయి. పూర్తిగా మునిగిన పొలాలు పనికిరావని రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడురోజులుగా నీటిలోనే ఉంటున్న పైరు మురిగిపోయి పనికిరాకుండాపోతుందని రైతాంగం అంటున్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పార్టీశ్రేణులు, అధికారులతో కలిసి ఆదివారం ముంపునకు గురైన పొలాలను పరిశీలించి రైతులను ఆదుకుంటామని భరోసానిచ్చారు. పొలాలను వీడియో తీసి ఉన్నతాధికారులకు పంపించారు. బాపట్ల మండలంలో 6 వేల హెక్టార్లు, కర్లపాలెం మండలంలో 4వేల హెక్టార్లు, పిట్టలవానిపాలెం మండలంలో 3వేల హెక్టార్లకు పైగా వరి పొలాలు నీటమునిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో డ్రైనేజిలు ఉధృతంగా ప్రవహించటం వల్ల ఈ ప్రాంతాలలోని పొలాలలో నీరు బయటకు వెళ్ళటం లేదు. పొలాలను పరిశీలించిన వారిలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది : వేగేశన


నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

కర్లపాలెం, సెప్టెంబరు 1 : మూడురోజులు నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నీటమునిగిన పొలాల రైతులను ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని చింతాయపాలెంలో నీటమునిగిన వరిపైర్లను పరిశీలించారు. రైతులు నీటమునిగి పాడైపోయిన వరి పైరును నరేంద్రవర్మకు, అధికారులకు చూపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏపూరి భూపతిరావు, నక్కల వెంకటస్వామి, పిట్ల వసంతరెడ్డి, మాడా శ్రీనివాసరావు, చిలకల శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ బాజి, ఏడీఏ లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ సలీమా, పఠాన్ అహ్మద్‌బాషా, వ్యవసాయ సహాయకురాలు భ్రమరాంబ, రౌతు మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నిండు కుండలాగా ప్రవహిస్తున్న నాగరాజు కాల్వ

మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బాపట్ల నియోజకవర్గంలో పలు కాల్వలు నిండు కుండలా ప్రవహిస్తున్నాయి. కర్లపాలెం మండలంలోని బుద్దాం తుంగభద్రకాల్వ అంచుల వరకు నీటి మట్టం పెరిగింది. దీంతో మండల రైతాంగం ఆందోళన చెందుతున్నారు.

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 1 :మండల వ్యాప్తంగా కురిసిన భారీవర్షాలకు ఈ ఏడాది రైతులు సాగు చేసుకున్న పంట పొలాలు సుమారు 5వేల ఎకరాలు నీట మునిగాయని పిట్టలవానిపాలెం మండల వ్యవసాయశాఖాధికారి సి.హెచ్.సత్యానంద్ తెలిపారు. రైతులు నీటమునిగిన వరిపంట పొలాలలోని నీటిని బయటకు తరలించాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నల్లమడ డ్రెయిన్‌పై కుంగిన పాత బ్రిడ్జి

బాపట్ల, సెప్టెంబరు 1 : బాపట్ల మండలం నందిరాజుతోట-హైదర్‌పేట మధ్య నల్లమడ డ్రెయిన్‌పై ఉన్న పాతబ్రిడ్జి వరదనీటి ఉధృతికి కిందకు కుంగింది. రెండు కానాల మధ్య ఓ వైపు బ్రిడ్జి కిందకు కుంగటం గుర్తించిన హైదర్‌పేట గ్రామస్తులు బ్రిడ్జిపై రాళ్ళు అడ్డం పెట్టి వాహనచోదకులను, ప్రజలను బ్రిడ్జిపై రావొద్దని చెబుతున్నారు. నీటి ఉధృతికి పరిస్థితి తీవ్రంగా ఉందికాబట్టి బ్రిడ్జి కుంగి కూలితే ప్రమాదం జరుగుతుందని హెచ్చరిస్తున్నారు. డ్రైనేజి అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పాతబ్రిడ్జి రాకపోకలను నిలిపివేయాలని కోరుతున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, సెప్టెంబరు 1 : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. జనసేనపార్టీ అధినేత, డిప్యూటీ సీఎం కె.పవన్‌కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం అక్షయ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించి రక్తదానం చేసిన వారిని అభినందించారు. అనంతరం రక్తదానం చే సిన వారిని, నిర్వాహకులను అభినందించి సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కామిశెట్టి సాయిబాబు, గుంటుపల్లి తులసీకుమారి, మాజీ కౌన్సిలర్ కుట్టుబోయిన రమేష్‌బాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, కారుమూరి అంజనేష్, మహేష్, అజయ్, వినోద్, కిరణ్‌కుమార్‌పాల్గొన్నారు.

నీటిపాలైన వరి నాట్లు

● ఆందోళనలో రైతన్నలు
● ఆదుకోవాలని వేడుకోలు

రేపల్లె, చెరుకుపల్లి, సెప్టెంబరు 1 : రెండురోజులు కురిసిన భారీవర్షాలకు నియోజకవర్గంలోని రేపల్లె, రేపల్లెరూరల్, నగరం, చెరుకుపల్లి, నిజాంపట్నం మండలాల్లోని వేలాది ఎకరాలలో సాగు చేసిన వరి నాట్లు నీటమునిగి రైతులకు నష్టాలను తెచ్చిపెట్టింది. అయితే రైతులు నీటిని పంట పొలాల్లో నుంచి బయటకు పంపించేందుకు కూడా వీలులేకుండా నీరు ఉధృతంగా పంట పొలాల్లో ప్రవహించటంతో ఏమి చేయాలో తెలియక రైతులు ఆవేదన చెందుతున్నారు.


వరదప్రాంతాలను అధికారులు ప్రత్యేకంగా పరిశీలించాలని సూచవలిస్తున్న అనగాని శివప్రసాద్

ప్రత్యేక శిబిరాలకు రావాలి : జడ్పీ సీఈవో

వరద ఉధృతంగా వస్తుందని గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారులకు సహకరించాలని జడ్‌పీసీఈవో వసంతరాయుడు అన్నారు. ఆదివారం ఆయన పెనుమూడి తదితర గ్రామాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా ఉండి వరద ఉధృతిని గమనించి గ్రామాలలోని ప్రజలను సురక్షితప్రాంతాలకు తరలించాల్సిన బాధ్యత మనపైఉందన్నారు. అదేవిధంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ వరద నీరు ప్రాంతాలను ఆయన పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేసి ప్రత్యేక శిబిరాలకు తరలించి వారికి అన్ని వసతులను కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి పానకాలరావు, తహసీల్ధార్ మొర్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో శివపార్వతి, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జలదిగ్భందంలో జగనన్న కాలనీలు


మూలపాలెం జగనన్నకాలనీ గృహాల మధ్య నిలిచిన వర్షపునీరు

బాపట్ల, సెప్టెంబరు 1 : జలదిగ్బందంలో చిక్కుకున్న జగనన్న కాలనీల ప్రజలు అల్లాడిపోతున్నారు. అప్పులు చేసి గృహాలు నిర్మించుకొని అందులో ఉంటున్న ప్రజలకు మాత్రం కావాల్సిన కనీస అవసరాలు కల్పించటంలో గత పాలకులు తీవ్రంగా విఫలమయ్యారు. కాలనీలలో అంతర్గత రోడ్లు వేయకుండా వదిలేశారు. తాగునీటి సౌకర్యం కల్పించలేదు. డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటు చేయలేదు. ఫలితంగా మూడురోజులుగా కురుస్తున్న భారీవర్షాలతో కాలనీలు మొత్తం నీటిలో చిక్కుకున్నాయి. రోడ్లపై నిలిచిన నీరు ఇళ్ళ చుట్టూ చేరింది. పట్టణంలోని ఫ్యాడిసన్ లేఅవుట్‌లో ప్రజల పరిస్థితి కడుదయనీయంగా ఉంది. మూలపాలెం లేఅవుట్, బేతనీకాలనీ లేఅవుట్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న డ్రెయినేజిలు

బాపట్ల, సెప్టెంబరు 1 : తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలోని ప్రధాన డ్రెయిన్‌లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ ప్రాంతంలో కురిసిన వర్షపునీటితో ఎగువ ప్రాంతాలు నుంచి వస్తున్న నీటితో కాల్వలు తొణికిసలాడుతున్నాయి. కట్టలు బలహీనంగా ఉన్న చోట్ల గండ్లుపడుతాయోమోనని ప్రజానీకం, రైతులు ఆందోళన చెందుతున్నారు. బాపట్లలోని నల్లమడ డ్రైన్, పేరలి డ్రైన్‌లతోపాటు ఈస్ట్‌శ్యాంప్, వెస్ట్‌శ్యాంప్ డ్రైన్‌లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శ్యాంప్ డ్రైన్‌లు నల్లమడ, పేరలి డ్రెయిన్‌లలో కలుస్తాయి. అయితే ప్రధాన డ్రెయిన్‌లలో వరదనీరు ఉధృతంగా ఉండటంతో శ్యాంప్ డ్రెయిన్‌లలో నీరు ముందుకు పారకుండా నిలిచిపోయాయి. అదేవిధంగా కర్లపాలెం మండలంలోని ఈస్ట్‌శ్యాప్, పిట్టలవానిపాలెం మండలంలోని తెనాలి డ్రైన్‌ల పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉన్నాయి.

● బాపట్ల రూరల్, సెప్టెంబరు 1 : మండలంలోని ఆసోదివారిపాలెం, మరుప్రోలువారిపాలెం గ్రామ పంటపొలాలలో రైతులు వేసిన గోంగూర, తోటకూర వంటి ఆకుకూరలు వర్షం నీటిలో మునిగి చెడిపోయాయి. అదేవిధంగా పూండ్ల, అప్పికట్ల, భర్తీపూడి, జమ్ములపాలెం, నరసాయపాలెం, కంకటపాలెం, మురుకుండపాడు, పాండరంగాపురం, ఆసోదివారిపాలెం, ముత్తాయపాలెం గ్రామాలలోని వరిపంటపొలాలు వర్షపు నీటితో నిండిపోయి చెరువులను తలపించాయి.

నీట మునిగిన పొలాలను పరిశీలించిన ఏవో

కొల్లూరు, సెప్టెంబరు 1 : మండల పరిధిలోని దోనేపూడి, చినపులివర్రు, రావికంపాడు, క్రాప గ్రామాల్లో నీట మునిగిన వరి పైరును ఏవో సందర్శించారు. ఆదివారం నీట మునిగిన పొలాలను చూసిన ఏవో రైతులకు పలు సూచనలు చేశారు. ఈనెల 15లోగా పాసుబుక్, ఆధార్ కార్డు కాపీలను ఇచ్చి నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే అన్ని పథకాలకు పంట నమోదు చాలా ముఖ్యమని రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు.

● చుండూరు, సెప్టెంబరు 1 : భారీ వర్షాల కారణంగా మండలంలోని 25వేల ఎకరాల్లో పంట భూములు నీట మునిగాయి. తుంగభద్ర డ్రైయిన్ ప్రమాద కర స్థాయిలో కట్టల అంచుల వరకు పొంగి ప్రవహిస్తుంది. దీని ప్రవాహ ఉధృతికి దుండిపాలెం, యడ్లపల్లి, వలివేరు, చుండూరు, మోదుకూరులోని లోతట్టు ప్రాంతాల్లోకి, నిమ్మతోటల్లోకి ఇతర పంట భూముల్లోకి బారీగా వర్షపు నీరు చేరింది. వలివేరు, అంబేద్కర్ నగర్, మున్నంగివారిపాలెం, యడ్లపల్లి, దుండిపాలెం తదితర గ్రామాల్లో రోడ్ల వెంట గుడిసెలు వేసుకుని నివశించే సంచార జాతుల పేదల గుడిసెల్లోకి వర్షపు నీరు చేరి పడిపోవడంతో వెంటనే తహసీల్దార్ దేవిశెట్ల మల్లిఖార్జునరావు వారిని సమీప పాఠశాలలోకి తరలించి వారికి కావాల్సిన తాగునీరు, భోజన ఏర్పాట్లు గత రెండులుగా అందిస్తున్నారు. మండల గ్రామాల్లో చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో సరఫరా నిలిచిపోయింది.

● అమృతలూరు, సెప్టెంబరు 1 : భారీ వర్షంతో మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆయా గ్రామాల పరి.దిలో సుమారు 10 వేల ఎకరాల వరి నాటు నీట మునిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఎంతో కష్టపడి నాట్ల వేశామని ఇలా నీట మునగడంతో నాటు దెబ్బతింటుదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎటు చూసినా పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఈ నీరు అంతా ఎప్పటికిపోతుందో అని రైతులు ఆందోళన చెందుతున్నా రు. పలు కాలనీల్లో వర్షపు నీరు చేరడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు పేదలకు ఆహారం అందజేశారు. ప్రత్యేక శిబిరంలో ఉన్న బాధితులకు ఆహారంను అధికారులు అందజేస్తున్నారు.

జేసీగా బాధ్యతలు తీసుకున్న ప్రఖర్ జైన్

బాపట్ల, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జేసీగా ప్రఖర్ జైన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జేసీగా పని చేసిన సుబ్బారావు ఆదివారం పదవీ విరమణ చేయగా సోమవారం జైన్ జేసీగా బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. కానీ జిల్లాలో వరద పరిస్థితుల దృష్ట్యా ఒక రోజు ముందే కొల్లూరులోనే ప్రఖర్‌జైన్ జేసీగా బాధ్యతలు స్వీకరించి పునరావాస కేంద్రాలను కలెక్టర్ వెంకటమురళితో కలిసి పరిశీలించారు

వరద గుప్పెట్లో 36 లంక గ్రామాలు

● కలెక్టర్ సహా అధికార యంత్రాంగం మొత్తం కొల్లూరులోనే మకాం


అరవింద వారధి వద్ద వరద ఉధృతి పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

కొల్లూరు, భట్టిప్రోలు, సెప్టెంబరు 1 : కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ప్రకాశం బ్యారేజీ దిగువకు 9 లక్షల పైచిలుకు వరద నీటిని విడుదల చేయడంతో కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు మండలాలతో పాటు కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలంలోని కొన్నిగ్రామాలతో సహా మొత్తం 36 గ్రామాలు వరద గుప్పెట్లో చిక్కుకున్నాయి. సుగ్గునలంక, పోతార్లంక, గాజుల్లంక, కొల్లూరు కరకట్ట దిగువన, దోనేపూడి వద్ద వరద నీరు రోడ్లపై ప్రవహించడంతో ఆ మార్గంలో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీలు వృద్ధులను, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలను ఆటోలు, ట్రాక్టర్లు ఇతర వాహనాల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భట్టిప్రోలు మండలంలోని లంక గ్రామాల్లో సైతం వరద నీరు చుట్టుముట్టింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కొల్లిపర మండలంలోని అన్నవరపు లంకలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలంటూ ఆయన అక్కడకు స్వయంగా వెళ్లి ప్రజలకు తెలియజేశారు. పెసర్లంక అరవింద వారధి వద్ద కృష్ణానది వరద ప్రవాహాన్ని పరిశీలించడంతో పాటు గండి వద్ద పోసిన కట్టను చూసి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబులు కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని వరద ప్రభావిత లంక గ్రామాల్లో పర్యటించి 10 లక్షల క్యూసెక్కుల వరకు వరద వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రజలంతా గ్రామాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు తరలిరావాలని సూచించారు. ఆయా ప్రాంతాలకు నిత్యవసర సరుకుల సరఫరాకు 40 మర పడవలను సిద్ధంగా ఉంచామన్నారు. లంక గ్రామాలకు వెళ్లేందుకు కొల్లూరు, దోనేపూడి, వెల్లటూరు, పెనుమూడి వద్ద బోట్లు సిద్ధం చేశామన్నారు. బోట్ల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యత మత్స్య శాఖాధికారులకు అప్పగించినట్లు చెప్పారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ఇక్కడ సిద్ధంగా ఉన్నాయని, వరద విపత్తును దృష్టిలో ఉంచుకుని అరవింద వారధి వద్ద పోలీసు పహారా పెంచాలని ఎస్పి తుషార్‌డూడీకి కలెక్టర్ సూచించారు. సోమవారం 10 లక్షల క్యూసెక్కుల వరద నీరుదిగువకు వస్తుందని ప్రభుత్వం నుంచి సమాచారం వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు ముమ్మరం చేయాలన్నారు.

గండి వద్ద కట్టకు కోత

కొల్లూరు మండలం పెసర్లంక అరవింద వారధి ఎగువన గండి వద్ద పోసిన కట్టపై నుంచి వరద నీరు పొంగి పొర్లడం, క్రమేపి వరద ఉధృతి ఎక్కువ కావడంతో కట్ట కోతకు గురై ఒక్కసారిగా వరద నీరు పెసర్లంక గ్రామం వైపు విరుచుకుపడి క్షణాల్లో కొల్లూరు కరకట్టను తాకింది. కొల్లూరు కరకట్ట దిగువన లంక గ్రామాలకు వెళ్లే రహదారిపై సైతం వరద నీరు ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలను పోలీసులు నిలిపి వేశారు. కొల్లూరు, గాజుల్లంక వద్ద ఇటుకబట్టీలన్నీ వరద నీటిలో చిక్కుకున్నాయి. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని లంక గ్రామాల్లో సుమారు 12 వేల పై చిలుకు మెట్ట భూముల్లో రైతులు అరటి, పసుపు, కంద, తమలపాకు, బొప్పాయి పంటలతో పాటు కూరగాయ పంటలను సాగు చేస్తున్నారు. ఆయా పంటలన్ని ఎందుకు పనికి రాకుండా పోయే పరిస్థితి తలెత్తింది.

● వేమూరు, సెప్టెంబరు 1 : మండలంలోని భట్టిప్రోలు, రేపల్లె మెయిన్ డ్రైయిన్లు నిండుకుండలా ప్రవహిస్తున్నాయి. మండల పరిధిలోని 17 గ్రామాలలో 14500ఎకరాలలో నాట్లు వేయగా, 7500ఎకరాలలో పూర్తిగా నాట్లు మునిగిపోయి దెబ్బతింటున్నట్లు అధికారులు అంచనా. పేదల కోసం కేటాయించిన లేఔట్లలోకి వర్షపు నీరు చేరి స్తంభించిపోయాయి. వేమూరు, చదలవాడ, జంపని, పెరవలి, పెరవలిపాలెం, చావలి గ్రామాల పరిధిలోని పల్లపు ప్రాంతాలలోని చేలలో నీరు పూర్తిగా స్తంభించింది.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం

● పట్టణ మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 1: నేడు జరగనున్న వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం చేసినట్లు పట్టణ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. స్థానిక చెంచుపేటలోని వాటర్ ప్లాంటులో ఆదివారం ఏర్పాటు చేసిన మొక్కలను పట్టణ కమిషనర్ బి శేషన్న పరిశీలించి, పట్టణంలో నాటడానికి సిద్ధం చేయాలని హార్టీకల్చర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన వనం-మనం కార్యక్రమానికి మొక్కలను సిద్ధంచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని, రోడ్డు డివైడర్‌లలో ఈ మొక్కలను నాటుతామన్నారు. కార్యక్రమంలో మున్సిల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్, హార్టీకల్చర్ అధికారులు, సిబ్బంది పాల్గొంటారని అన్నారు.

సీఎం కాలనీలో ప్రతి సమస్య పరిష్కరిస్తా: మంత్రి మనోహర్

తెనాలి రూరల్, సెప్టెంబరు 1: పట్టణంలోని సీఎం కాలనీలో నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి వాటిని పరిష్కరించేలా కృషి చేస్తానని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సీఎం కాలనీని ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. అక్కడ నివసిస్తున్న నివాసితుల యోగక్షేమాలు విచారించారు. కాలనీలో మురుగు, విద్యుత్ వంటి పలు సమస్యలున్నాయని మనోహర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రజలందరికీ మంచి జరిగేలా చూస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

తెనాలి 2 టౌన్ సీఐపై సస్పెన్షన్ వేటు

గుంటూరు, సెప్టెంబరు 1: తెనాలి టూ టౌన్ సీఐ సుధాకర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఆదివారం రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు. గత ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం గత జనవరిలో నెల్లూరు జిల్లాకు చెందిన సుధాకర్‌ను తెనాలి టూ టౌన్ సీఐగా నియమించారు. ఇది ఇలా ఉంటే తెనాలి టూ టౌన్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న పేకాటకు ఆయన సహకారం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఆయా ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారించి సీఐ సహకారం ఉన్నట్లు విచారణాధికారి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. దీంతో సీఐపై సస్పెన్షన్ వేటుపడింది.



పునరావాస కేంద్రానికి గ్రామస్థులను తీసుకువస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, పునరావాస కేంద్రంలో ఆహారం ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న తహసీల్దార్


వరద బాధితులకు ఆహారం పంపిణీ చేస్తున్న ఎస్‌వీ యోగా సభ్యులు


పెదకాకాని సుందరయ్య కాలనీలో ఇళ్ల చుట్టూ చేరిన వర్షపు నీరు



కొల్లిపర మండలం అన్నవరంలంకలో వరద నీటిలో తేలియాడుతున్న పసుపు పంట, పిడపర్రులకు వద్ద వరద ఉధృతికి పూర్తిగా మునిగిపోయిన కంద

డ్రెయిన్ కట్టతెగి రాకపోకలు నిలిపివేత


గుంటూరు-నందివెలుగు ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న నీరు

తెనాలి రూరల్, సెప్టెంబరు 1: తెనాలి మండలంలోని జాకీర్‌హుస్సేన్ నగర్ - హాఫ్‌పేట గ్రామాల మధ్యలో నుంచి ప్రవహించే నల్లమడ డ్రెయిన్ నీటి ఉధృతికి కట్టలు తెగాయి. విషయం తెలుసుకున్న అధికారయంత్రాంగం అప్రమత్తమైంది. గుంటూరు - నందివెలుగు ప్రధాన రోడ్డు మార్గంగా కాలువ ప్రవహించడంతో ఆ నీటి ఉధృతికి వాహనదారులు ప్రమాదాలబారిన పడకుండా ముందస్తుగా పోలీసులు ఆ మార్గంలో రాకపోకలు నిలుపుదల చేశారు. డ్రైన్ నుంచి దాదాపుగా కిలోమీటరు మేర మోకాళ్లలోతు నీరు రోడ్లపైకి పారటంతో అధికార యంత్రాంగం కాలువ నీటి ప్రవాహాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టారు. నంబూరు వద్ద ఉన్న డ్రైన్ కట్టతెగడంతో ఆ కాలువ నీరు నల్లడైన్‌లోకి చేరి ఈ పరిస్థితి ఉత్పన్నమైందని అధికారులు తెలిపారు. గత ప్రభుత్వం డ్రైన్ల పూడికలు తీయించకోవడం, కట్టలను బలోపేతం చేయకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ అధికారులు సురక్షిత చర్యలు చేపట్టారు.

డాక్టర్ ఆవుల శ్రీనివాస్‌కు బంగారు పతకం

తెనాలి, మారీసుపేట, సెప్టెంబరు 1: స్థానిక బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలోని ఐఎంఏ హాల్‌లో ఆదివారం డాక్టర్ పాటిబండ్ల దక్షిణమూర్తి గోల్డు మెడల్‌ను నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఆవుల శ్రీనివాస్‌కు అందజేశారు. బంగారు పతకాన్ని తెనాలి శాఖ అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ దక్షిణమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ దక్షిణామూర్తి పేరున అందిస్తున్న గోల్డ్ మెడల్‌ను అందుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. మూత్రపిండ వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవలసిన నూతన వైద్య విధానంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు అనిల్‌కుమార్, పాటిబండ్ల వేణుగోపాల్, చందు సాంబశివుడు, శ్యామ్ ప్రసాద్, వినీల్, నరసింహరావు, భానుప్రసాద్, శేషగిరిరావు, నీలిమ, మధుప్రభాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తొలగని వరద ముప్పు

● అన్నదాతలకు అపార నష్టం
● స్తంభించిన జన జీవనం

పొన్నూరు టౌన్, చేబ్రోలు, సెప్టెంబరు 1: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే అన్నదాతకు భారీ వర్షాలు అపారనష్టాన్ని మిగిల్చాయి. పొన్నూరు, చేబ్రోలులో మండలాల్లో కురిసిన భారీ వర్షాలకు 25వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. పొన్నూరు చేబ్రోలు మండలాల్లో పంట కాల్వలు, మురుగు నీటి కాల్వలకు చివరి భూములుగా ఉండటంతో పైనుంచి వచ్చే వరద నీరు బయటకు వెళ్లే మార్గం లేక పంట పొలాలను ముంచెత్తుతోంది. పొన్నూరు మండలంలో వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం 23వేల ఎకరాలో వరిపంట సాగు చేయగా ప్రస్తుతం 15వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. చేబ్రోలు మండలంలో పది వేల ఎకరాల్లో వరి పంట నీటిపాలైంది. పొన్నూరు మండలంలోని వెల్లలూరు, బ్రాహ్మణకోడూరు, మునిపల్లె, పచ్చలతాడిపర్రు, గోళ్లమూడిపాడు, కట్టెంపూడి, కసుకర్రు, జడవలి కొండముది, మాచవరం, ములుకుదరు తదితర గ్రామాలో వాన నీటి ముంపు అధికంగా ఉంది. వేలాది ఎకరాలో వర్షపునీరు చేరి పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. మరో రెండు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతుల్లో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. అలాగే చేబ్రోలు మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న అప్పాపురం ఛానల్, గుంటూరు నల్లాలు కట్టలు పొంగి ప్రవహిస్తూ పంట పొలాల్లోకి భారీగా చేరాయి. వర్షపు నీరు, వరద నీరు పంట పొలాల్లోకి చేరటంతో ఎటుచూసినా పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగు ప్రారంభంలోనే భారీ వర్షాలు రైతులకు అపార నష్టాన్ని మిగులుస్తున్నాయి. పదివేల ఎకరాలో వరి పంట నీటి పాలైంది.

డీవీసీ కాలనీలో వాననీరు బయటకు వెళ్లే మార్గం లేక నివాస గృహాలోకి చేరింది. కాలనీలో పదుల సంఖ్యలో గృహాలలోకి ఈ వాన నీరు చేరింది, కురిసిన భారీ వర్షపు నీరు కాలనీ నుంచి బయటకు వెళ్లే మార్గం లేకపోవటంతో కాలనీలో జనావాసాల మధ్యే భారీగా నిల్చిపోయింది. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు కాలనీని సందర్శించి పారిశుధ్య కార్మికులతో వాన నీటిని మళ్లించే ప్రయత్నాలు ప్రారంభించారు.

పునరావాస కేంద్రాలకు 47 కుటుంబాల తరలింపు

తెనాలి రూరల్, సెప్టెంబరు 1: బుర్రిపాలెం ఎస్టీ కాలనీలోని 47 కుటుంబాలను మండల తహసీల్దార్ గోపాలకృష్ణ పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆ గ్రామంలోని కాలనీకి ఆనుకుని రేపల్లె డ్రెయిన్ ఉధృతంగా ప్రవహించడంతో పాటు కాలనీలో మోకాళ్లలోతులో నీరు చేరాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ గోపాలకృష్ణ కాలనీలో పర్యటించి ప్రజలను సురక్షితంగా ఉండేలా చర్యలు చేపట్టారు. పునరావాస కేంద్రాలకు ఆ కాలనీ వాసులు రామని చెప్పడంతో వారికి సున్నితంగా నచ్చజెప్పి సుమారుగా 47 కుటుంబాలకు చెందిన 150మందిని గ్రామంలోని హైస్కూల్‌కు తరలించారు. అక్కడ వారికి ఆహారం, తాగునీరు, వైద్యసేవలు ఏర్పాటు చేశారు.

● తెనాలి, మారీసుపేట: వరద ప్రభావిత ప్రాంత ప్రజలకు పూర్తి సహాయ సహకారలను అందించాలని పట్టణ మున్సిపల్ కమిషనర్ బి శేషన్న మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద విజయవాడలోని పలు ప్రాంతాలలోని వరద ప్రభావిత ప్రాంత ప్రజలకు ఆహారాన్ని అందించడానికి మున్సిపల్ అధికారులను, సచివాలయ సిబ్బందిని కమిషనర్ శేషన్న ప్రత్యేక బస్సులో పంపించారు.

● తెనాలి రూరల్: తెనాలి చంద్రబాబునాయుడు కాలనీలోని బాలికల గిరిజన సంక్షేమ హాస్టల్‌లో భారీ వర్షానికి నీరు చేరడంతో ఆ విద్యార్థులకు పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆ కేంద్రాల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, ఇతర సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు.

● కొల్లిపర: ప్రకాశంబ్యారేజి నుంచి కృష్ణానది దిగువకు విడుదల చేస్తున్న వరద నీటి ప్రవాహంలో లంక భూముల్లో పంటలు ముంపునకు గురౌతున్నాయి. ఆదివారం సాయంత్రానికి వరద ప్రవాహం లంక భూముల్లోకి చేరింది. బ్యారేజి నుంచి విడుదల చేసే నీటి ప్రవాహం 8లక్షల క్యూసెక్కులు దాటడంతో లోతట్టు భూముల్లోని పంటలు క్రమ, క్రమంగా నీటమునిగి పోతున్నాయి. దీంతో లంక భూముల్లోని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మండలంలోని మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం, కొల్లిపర, బొర్డులంక, బొమ్మువానిపాలెం, అన్నవరం, అన్నవరంలంక, కొత్తూరులంక సమీపంలోని లంక గ్రామాల్లో కృష్ణానది ఒడ్డున పల్లపు ప్రాంతాల్లో ఉన్న పసుపు, కంద, అరటి, మొక్కజొన్న పంటలు వరద ఉధృతికి నీటిలో తేలియాడుతున్నాయి. కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలం రొయ్యూరు గ్రామానికి చెందిన ఏడుగురు కొల్లిపర మండలం పరిధిలోని వల్లభాపురం తిరుపతమ్మగుడి ఎదురుగా మాదిగదిబ్బలో 600 గొర్రెలను మేపుకునేందుకు వచ్చి వరదలో చిక్కుకోవటంతో 112 నెంబరుకుకాల్ చేశారు. దీంతో కొల్లిపర పోలీసులు స్పందించి వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. కృష్ణానది కరకట్ట కోతకు గురవ్వటంతో పాటు దెబ్బతినటంతో ప్రమాద భరితంగా మారింది. ప్రకాశం బ్యారేజీ నుంచి 8లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందేమోనని కరకట్టకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు మండలాల్లో కృష్ణానది కరకట్ట పలుచోట్లకోతకు గురవ్వటంతో ప్రమాద పరిస్థితులు నెలకొన్నాయి.

● పెదకాకాని: మండలంలో పెదకాకాని, నంబూరు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, దేవరాయభట్లపాలెం తదితర గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. పెదకాకాని సమీపంలోని గుంటూరు కెనాల్‌కు లాకులు వద్ద, తక్కెళ్ళపాడు వద్ద, నంబూరు వద్ద రెండు చోట్ల గండ్లు పడ్డాయి.


పెదకాకాని సమీపంలో గుంటూరు కెనాల్ గట్టు తెగి పొలాల్లోకి పోతున్న వరద నీరు


చేబ్రోలు మండలంలో నారాకోడూరు గ్రామంలో దొండ తోటలోకి చేరిన వర్షపు నీరు


పడవను మెరక ప్రాంతానికి తెచ్చుకుంటున్న మత్స్యకారులు

ఆగిన వర్షం

● ఊపిరిపీల్చుకున్న మత్స్యకారులు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు1 : వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలు ఆదివారం ఉదయానికి కొంతమేర తగ్గుముఖం పట్టాయి. దీంతో మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు. కొందరు తమ పడవలను మెరక ప్రాంతానికి తెచ్చుకున్నారు. మరలా వర్షం కురిసినా ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే ఎక్కడా తుఫాన్ షెల్టర్లలో ఉండేందుకు మత్స్యకారులు ఇష్టపడలేదు. పెద్దగా నష్టమేమీ లేదని చెప్పారు. వేట ఆగడం ఒక్కటే ప్రతిబంధకంగా మారిందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు తీరప్రాంత పరిస్థితిని తెలుసుకుంటూ అవసరమైతే అన్ని సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

మునిగిన పడవ

వాడరేవుకు చెందిన ముగ్గురు మత్స్యకారులు శనివారం సముద్రంలో వేటకు వెళ్లారు. తిరిగి వచ్చే సమయంలో వారి బోటుకు రంధ్రం ఏర్పడింది. దీంతో బోటును అక్కడే లంగరు వేసి వేరే బోటులో మత్స్యకారులు ఒడ్డుకు చేరారు. ఈ క్రమంలో ఆదివారం వైజాగ్‌కు చెందిన మత్స్యకారుల సహాయంతో సముద్రంలోకి వెళ్లగా బోటు మునిగింది. కొన్ని గంటలపాటు శ్రమించి ఆ బోటును ఒడ్డుకు చేర్చారు. ఘటనా స్థలాన్ని ఈపురుపాలెం ఎస్సై శివకుమార్ పరిశీలించారు. మత్స్యకారులతో మాట్లాడారు.


అద్దంకి భవానిసెంటర్ లో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్సై ఖాదర్‌బాషా

రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి

అద్దంకి, సెప్టెంబరు 1 : రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక భవానీ సెంటర్‌లో స్థానికులతో ఎస్ఐ రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నియమాలు గురించి అవగాహన కల్పించారు. అనంతరం దర్శి రోడ్డులో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న వ్యక్తులను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

ట్రాన్స్‘ఫార్మర్’ వెతలు

అటు దొంగలు.. ఇటు కరెంటోళ్ల దోపిడీ
విద్యుత్ శాఖలో ఇదీ పరిస్థితి
ఇష్టారీతిన పొలాల్లో చోరీలు
నాలుగేళ్లలో 385 ట్రాన్స్‌ఫార్మర్లు
అవన్నీ ఎక్కువగా ఎత్తిపోతలవే
మిగతావి వ్యవసాయ బోర్లవి
మరోవైపు సిబ్బంది లంచాల బాదుడు
విలవిల్లాడిపోతున్న కర్షకులు
కనెక్షన్ కోసం రైతు నుంచి రూ.20వేలు
తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ లైన్‌మన్

ఒంగోలు రూరల్ మండలం ఉలిచిలోని తారకరామ ఎత్తిపోతల కింద వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ పథకం కోసం 240కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దానిని జూలై 4న దొంగలు పగులగొట్టి రాగి తీగను ఎత్తుకెళ్లారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.8లక్షలు. ఇంతవరకూ కొత్తది బిగించలేదు. దీంతో సాగుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. అదే మండలంలోని చేజర్ల గ్రామంలోని చేజర్లమ్మ ఎత్తిపోతల పథకం కింద 700 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ పథకానికి 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దానిని కూడా జూలై 3నే దొంగలు పగులగొట్టారు. దీంతో పంటల సాగుకు ఇబ్బందికరంగా మారింది.

రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన వాకా కిరణ్ అనే రైతు తన వ్యవసాయ భూమిలో బోరు ఏర్పాటు చేసుకున్నారు. అందుకు అవసరమైన విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. రూ.20వేలు లంచం ఇస్తేనే కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని లైన్‌మన్ రామలింగయ్య డిమాండ్ చేశాడు. రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా రామలింగయ్య రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.

విద్యుత్ సిబ్బంది ధనదాహం, దొంగల చేతివాటంతో రైతులు విలవిల్లాడుతున్నారు. ఒకవైపు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది కుమ్మక్కై అందిన కాడికి దోచుకుంటున్నారు. ప్రతి పనికీ రేటు నిర్ణయించి వసూళ్ల పర్వం సాగిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్లు మొదలు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లైన్‌ల మార్పు వంటి వాటికి కాసులు పడితేనే కదులుతున్నారు. అందరూ కలిసి రైతులను జలగల్లా పీక్కుతుంటున్నారు. ఇంకోవైపు జిల్లావ్యాప్తంగా ఎత్తిపోతల పథకాలు, పొలాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీలు గత వైసీపీ పాలనలో పెచ్చరిల్లాయి. నాలుగేళ్లలో 385కుపైగా ట్రాన్స్‌ఫార్మర్లు దొంగల పాలయ్యాయి. దీంతో రైతులు పంటల సాగుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది, అధికారుల తీరుపై వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొంగల పాలైన ట్రాన్స్‌ఫార్మర్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంలో తాత్సారం చేస్తుండటంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 1 : జిల్లాలో విద్యుత్‌శాఖ అధికారుల తీరు కర్షకులను కన్నీరు పెట్టిస్తోంది. వారి అవినీతికి అంతులేకుండా పోయింది. అదేసమయంలో దొంగలు స్వైరవిహారం చేస్తున్నారు. పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌లను రాత్రికి రాత్రి పగులగొట్టి రాగితీగ, ఇతరత్రా సామగ్రిని కొల్లగొడుతున్నారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. విద్యుత్ శాఖలో పనిచేసే కొందరు సంస్థకు రావాల్సిన ఆదాయానికి కూడా గండి కొట్టి సొంతలాభం కోసం పాకులాడుతున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలు పునరావృతం కాకూడదని ప్రభుత్వ పెద్దలు మొత్తుకుంటున్నా అధికారులు, సిబ్బంది తీరు మాత్రం మారడం లేదు. రైతుల అవసరాన్ని ఆసరా చేసుకొని అందినకాడికి దోచుకుంటున్నారు.

నాలుగేళ్లలో రూ.5కోట్లకుపైన విలువైన ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీ

ఉమ్మడి జిల్లాలో రైతుల కోసం పొలాల్లో ఏర్పాటు చేసిన 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 2020 నుంచి ఇప్పటి వరకూ 385 చోరీకి గురయ్యాయి. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ ఖరీదు రూ.లక్షకుపైనే ఉంటుంది. ఆప్రకారం జిల్లాలో దొంగల పాలైన ట్రాన్స్‌ఫార్మర్‌ల విలువ సుమారు రూ.4కోట్లకు పైనే ఉంటుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకూ 60 ట్రాన్స్‌ఫార్మర్లు ఉమ్మడి జిల్లాలో చోరీకి గురయ్యాయి. ఎత్తిపోతల పథకాలకు సంబంధించి 250కేవీ నుంచి 500కేవీ వరకూ ఉంటాయి. వీటి విలువ రూ.5 నుంచి రూ.10లక్షల వరకూ ఉంటుంది. అవి కూడా పెద్ద సంఖ్యలోనే దొంగల పాలయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులో ఉండే లక్షల రూపాయల విలువైన రాగి తీగను దొంగలు లాగేసి కేవలం రూ.10వేల నుంచి రూ.20వేలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో రైతుల వెతలు వర్ణనాతీతమయ్యాయి. సకాలంలో పంటలు సాగు చేయలేకపోతున్నారు. వేసిన పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. దీంతో రైతులు పెట్టుబడులతోపాటు రూ.కోట్లలో రాబడిని కోల్పోతున్నారు.

లంచం ఇస్తేనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్

పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు కొత్తదాని కోసం విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. నిబంధనల ప్రకారం రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకున్న నెలకు విద్యుత్ అధికారులు ఏర్పాటు చేయాలి. చోరీ జరిగితే అందుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీని అందజేసిన 24 గంటల్లో కొత్తదాన్ని ఉచితంగా బిగించాలి. కానీ అలా జరగడం లేదు. నెలలు గడిచినా అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం లేదు. పైగా ఒక్కోదానికి భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇలా ఉద్యోగులకు లంచాలు, ఏర్పాటు చేసిన తరువాత చోరులతో రైతులు అల్లాడుతున్నారు. దీంతోపాటు కొత్త వ్యవసాయ కనెక్షన్ ఇవ్వాలన్నా, లైన్ మార్చాలన్నా సిబ్బంది చేయి తడపాల్సిందే. వారు అడిగినంత ముట్టచెప్తేనే పనిచేస్తున్నారు. లేకుంటే ముప్పుతిప్పలు పెడుతున్నారు. రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కనికరించని పరిస్థితి నెలకొంది.

ఏసీబీకి చిక్కిన లైన్‌మన్

రాచర్ల మండలం అనుమలవీడులో వ్యవసాయ కనెక్షన్ ఇచ్చేందుకు రూ.20వేలు లంచం తీసుకుంటూ లైన్‌మన్ రామలింగయ్య శుక్రవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. అనుమలవీడు గ్రామానికి చెందిన వాకా కిరణ్ అనే రైతు తన వ్యవసాయ భూమిలో బోరు ఏర్పాటు చేసుకున్నారు. అందుకు అవసరమైన విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకొన్నారు. రూ.20వేలు లంచం ఇస్తేనే విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని లైన్‌మన్ రామలింగయ్య తేల్చిచెప్పాడు. అసలే వర్షాలు కురవక, పంటలు పండక అప్పోసొప్పో చేసి బోరు వేయించుకున్నానని, అంత డబ్బు ఇవ్వలేనని రైతు బతిమాలినా వినలేదు. దీంతో రైతు కిరణ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు రైతు లైన్‌మన్‌కు ఫోన్ చేయగా పొలానికి వచ్చి రూ.20వేలు తీసుకున్నాడు. అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు ఆయన్ను పట్టుకున్నారు. దర్శి మండలం రాజంపల్లిలో టి.లక్ష్మానాయక్ లైన్‌మన్ రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి లంచం తీసుకుంటూ గతంలో ఏసీబీకి పట్టుబడ్డాడు. ఇలాంటి సంఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ సిబ్బంది తీరు మారడం లేదు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై ఎస్పీ సీరియస్

ఎస్పీగా దామోదర్ బాధ్యతలు తీసుకున్న కొద్ది రోజులకే జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై విద్యుత్ శాఖ ఎస్ఈ ఆయన్ను కలిసి ఫిర్యాదు చేశారు. దీన్ని ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాల కేసులను వేగవంతంగా దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో కదిలిన పోలీసులు నెలరోజుల్లోనే 60 కేసుల్లో నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపారు.

అవినీతికి పాల్పడితే శాఖాపరమైన చర్యలు

-కె.వి.జి.సత్యనారాయణ,విద్యుత్‌శాఖ ఎస్ఈ

విద్యుత్‌శాఖ సిబ్బంది అవినీతికి పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. రైతులకు వేగవంతంగా సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం. పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ల కోసం వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలని ఏఈ, ఈఈలను ఆదేశించా. అలాగే రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే అంచనాలు తయారు చేయాలని అధికారులకు సూచించాం. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు నివారించేందుకు చర్యలు చేపట్టాం. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేశాం. విద్యుత్ శాఖ సిబ్బందితోపాటు రైతులను కలుపుకొని రాత్రుళ్లు గస్తీ చేస్తున్నాం.



మూలనపడిన చేజెర్ల ఎత్తిపోతల పథకం

అధికారులు సహకరించడం లేదు

- పమిడి వెంకటేశ్వరరావు, పొందూరు ఎల్ఐ స్కీం అధ్యక్షుడు

మా పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగ, ఇతర పరికాలు మూడు నెలల క్రితం చోరీకి గురయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఐడీసీ అధికారులను కలిసి విషయం తెలిజేశాం. ట్రాన్స్‌కో అధికారులకూ విన్నవించాం. కానీ ఎవ్వరూ సహకరించలేదు. ఇప్పటి వరకూ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. ఇప్పుడు పంటల సాగుకు సమయం మించిపోతోంది. దీంతో రైతులమంతా సొంతంగా డబ్బులు వేసుకొని కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించుకోవాలని నిర్ణయించుకున్నాం.

ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీతో ఇబ్బందులు

- తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, శ్రీ ఆంజనేయ ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు, నెన్నూరుపాడు

నెన్నూరుపాడులో ముసి ఆధారంగా మూడు ఎత్తిపోతల పథకాలున్నాయి. శ్రీ ఆంజనేయ ఎత్తిపోతల పథకం కింద దాదాపు 260 ఎకరాల ఆయకట్టు ఉంది. దీనికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను రెండు నెలల క్రితం దొంగలు పగులగొట్టి రాగితీగ చోరీ చేశారు. మరో రెండు ఎత్తిపోతల పథకాలకు కలిపి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా చోరీ చేశారు. ఈ విషయమై రెండు నెలల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకూ ట్రాన్స్‌ఫార్మర్‌లు రాలేదు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

సాగుపై సందిగ్ధంలో ఉన్నాం

- గద్దె వెంకటకృష్ణ, చేజర్ల ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు, ఒంగోలు రూరల్ మండలం

చేజర్ల ఎత్తిపోతల పథకం కింద 700 ఎకరాల ఆయకట్టు ఉంది. జూన్ 3వతేదీన పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగను దొంగలు చోరీ చేశారు. దీనిపై ఒంగోలు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకూ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం వరినాట్లు వేసుకునే సీజన్. అయితే నీరు అందే పరిస్థితి లేకపోవడంతో సాగుపై సందిగ్ధంలో ఉన్నాం. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రూ.10లక్షలు విద్యుత్‌శాఖకు చెల్లించాలంటున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలి.

ముంచెత్తిన వాన

48 గంటల్లో 90.1మి.మీ వర్షపాతం
పశ్చిమప్రాంతంలో అధికం
పొంగిన వాగులు,వంకలు
పలుచోట్ల రవాణాకు అంతరాయం
గుండ్లకమ్మ నాలుగు గేట్లు ఎత్తివేత
ఇతర వనరులకూ భారీగానే చేరిక
సాగుకు ఉపయుక్తం
అధికారులతో కలెక్టర్ అన్సారియా టెలికాన్ఫరెన్స్
తక్షణ చర్యలకు ఆదేశం


గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు ఎత్తి నీటిని బయటకు వదిలివేసిన దృశ్యం

ఒంగోలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను వర్షం ముంచెత్తింది. చాలాకాలంగా వానలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకానికి ఊరట కలిగించింది. 48 గంటల వ్యవధిలో ఏకంగా 90.01 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. దాదాపు సగం మండలాల్లో 100 నుంచి 170 మి.మీ కురిసింది. జిల్లా అంతటా ఈ వర్షాలు వ్యవసాయానికి, తాగునీటికి మేలు చేశాయి. పలు చోట్ల వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో రవాణాకు అంతరాయం కలిగింది. గుండ్లకమ్మకు భారీగా వరద నీరు రావడంతో నాలుగు గేట్లు వచ్చినది వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. ఇంతకు మించి వర్షాలు కురిస్తే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

పంటలకు జీవం.. ఖరీఫ్ సాగుకు ఊతం

దాదాపు నెలన్నర నుంచి జిల్లాలో సరైన వర్షం లేక ఖరీఫ్ సీజన్ ముందుకు సాగలేదు సుమారు 2.02 లక్షల హెక్టార్ల ఖరీఫ్ సాధారణ విస్తీర్ణంలో కేవలం 31శాతంలో మాత్రమే పంటలు సాగయ్యాయి. అందులోనూ పలుచోట్ల వర్షాలు లేక ఎండుముఖం పట్టాయి. ఆగస్టు నెలలోనూ ఎండల తీవ్రత అధికంగా ఉండటంతోపాటు చాలా చోట్ల తాగునీటికి ఇక్కట్లు తప్ప లేదు. ఈ పరిస్థితుల్లో వాయుగుండం ప్రభావంతో జిల్లాలో గురువారం అర్ధరాత్రి నుంచి వర్షం ప్రారంభమైంది. ఇది ప్రస్తుతం పొలాల్లో ఉన్న పైర్లకు జీవం పోసిన ఈవర్షం రానున్న రోజుల్లో పంటల సాగుకు ఉపకరించనుంది.

పశ్చిమప్రాంతంలో

జిల్లాలోని తూర్పు ప్రాంతంలో పోల్చితే పశ్చిమప్రాంతంలో వర్ష ప్రభావం అధికంగా ఉంది. నల్లమల ఆటవీ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో మార్కాపురం డివిజన్‌లోని ఆటవీ సమీప మండలాల్లో ఉన్న గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు వాగులు, వంకలు పొంగాయి. గుండ్లకమ్మ, జంపలేరులోకి వస్తున్న నీరు కంభం చెరువుకు భారీగా చేరుతోంది. దోర్నాల ప్రాంతంలో నల్లమల నుంచి భారీగా నీరు వస్తూ తీగలేరు పొంగి ప్రవహిస్తుండగా సప్లయ్ చానల్ ద్వారా మార్కాపురం చెరువుకు పెద్దఎత్తున నీరు చేరుతోంది. పెద్దారవీడు మండలంలోని రామాయపాలెం వద్ద నల్లవాగు వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. తీగలేరు ఉధృతితో మార్కాపురం-దోర్నాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అక్కడ పోలీసులు పికెట్ ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మళ్లించారు. ఇతర పలు గ్రామాల మధ్య ఇలాంటి పరిస్థితే కనిపించింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం

వర్షాలతో పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అక్కడక్కడా ఇళ్లు కూలాయి. మార్కాపురం మండలం తిప్పాయపాలెంలో గృహాల మధ్య నీరు చేరి ప్రజలు అవస్థ పడ్డారు. త్రిపురాంతకం మండలం గణపవరం వద్ద ఎస్సీ కాలనీలో రేకుల షెడ్డు పడిపోయింది. కురిచేడు మండలం గంగదొనకొండలో పాపిరెడ్డి అనే వ్యక్తికి చెందిన పాతమిద్దె కూలిపోయింది. ఆ సమయంలో అందులో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పగలు కూడా జల్లులు పడ్డాయి. ఈనేపథ్యంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. పారిశుధ్య చర్యలపై తక్షణం దృష్టి పెట్టాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రవాణా, విద్యుత్ సరఫరాకు అటంకాలు లేకుండా చూడాలన్నారు. పలు ప్రాంతాల్లో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వర్షాల వల్ల నష్టాలు జరగకుండా సిబ్బందిని అప్రమత్తం చేశారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టులోకి భారీగా నీరు

మద్దిపాడు : అల్పపీడనం ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గుండ్లకమ్మ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 34.38 మీటర్లు కాగా ప్రస్తుతం 20.90 మీటర్ల మేర నీరు చేరింది. ఇన్‌ఫ్లో 18వేల క్యూసెక్కులు ఉండగా అధికారులు నాలుగు గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు.

పంటలకు స్వల్ప నష్టం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. ఈ మేరకు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఆ ప్రకారం ఆరు మండలాల పరిధిలోని 17 గ్రామాల్లోని 668మంది రైతులకు చెందిన 1,334 హెక్టార్లలో పంటలకు స్వల్పంగా నష్టం జరిగింది. కొర్ర 504 హెక్టార్లు, సజ్జ 337 హెక్టార్లు, నువ్వు 493 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు.

నేడు పాఠశాలలకు సెలవు

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 1 : జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సెలవు ప్రకటించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఉప విద్యాధికారులు, ఎంఈవోలు తమ పరిధిలో పాఠశాలలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1 పరీక్షలను సైతం వాయిదా వేశారు.

జేసీగా బాధ్యతలు తీసుకున్న ప్రఖర్‌జైన్

బాపట్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ప్రఖర్ జైన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన సుబ్బారావు ఆదివారం పదవీవిరమణ చేయగా సోమవారం జైన్ జేసీగా బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. కానీ జిల్లాలో వరద పరిస్థితుల దృష్ట్యా ఒక రోజు ముందే కొల్లూరులోనే ప్రఖర్‌జైన్ జేసీగా బాధ్యతలు స్వీకరించి పునరావాస కేంద్రాలను కలెక్టర్ వెంకటమురళితో కలిసి పరిశీలించారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 1 : వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి సూచించారు. వ్యవసాయ శాఖ నూతనంగా అమలు చేయనున్న పొలం పిలుస్తోంది. కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం మంత్రి తన స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో ఉండే పంట పొలాలను రైతుల సమక్షంలో పరిశీలించి గ్రామ సభ నిర్వహించాలన్నారు. చీడపీడలకు నివారణ చర్యలపై శాస్త్రవేత్తల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సింగరాయకొండ సహాయ సంచాలకులు రమేష్, నిర్మల కుమారి, ఒంగోలు వ్యవసాయాధికారి శ్రీనివాసనాయక్ తదితరులు పాల్గొన్నారు.


మత్స్యకారుల ఆచూకీ లభ్యం

● ఎమ్మెల్యే ఏలూరి చొరవ
● క్షేమంగా తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు

చినగంజాం, సెప్టెంబరు 1 : జీవనోపాధి కోసం సముద్రంలో చేపల వేటకు వెళ్లి తప్పిపోయిన బాపట్ల జిల్లా చినగంజాం మండలం రుద్రమాంబపురం గ్రామానికి చెందిన మత్స్యకారుల ఆచూకీ లభ్యమైంది. గ్రామానికి చెందిన కొండూరి రాముడు, బసన్నగారి జయరాజు, కాటంగారి బాబూరావు, ఆవల మునియ్య గత నెల 20వ తేదీన గ్రామం నుంచి చెన్నైకి వెళ్లారు. చెన్నై ఫిషింగ్ హార్బర్ నుంచి 23వ తేదీన వీరితోపాటు తమిళనాడుకు చెందిన నలుగురు, ప్రకాశం జిల్లా కొత్తపట్నంకు చెందిన ఇద్దరు మత్స్యకారులతో ఐఎన్‌డీ టీఎన్-2 ఎంఎం-2210 నెంబరు గల మెకనైజ్డ్ బోటుతో చెన్నై నుంచి చేపల వేటకు బయల్దేరారు. ఆ రోజు నుంచి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నారు. వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నాలుగు రోజుల నుంచి వారి నుంచి కుటుంబసభ్యులకు ఎలాంటి సమాచారం లేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి ఆదివారం ఉదయం తీసుకెళ్లారు. ఈ విషయాన్ని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోంమంత్రి వంగలపూడి అనితకు ఎమ్మెల్యే వివరించారు. దీంతో మంత్రులు ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వెంటనే గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. బోటు మరమ్మతులకు గురైనట్లు సమాచారం తెలుసుకున్న అధికారులు విషయాన్ని కలెక్టర్ వెంకటమురళి దృష్టికి తీసుకెళ్లారు. వారిని సురక్షితంగా బయటకు తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రులను ఎమ్మెల్యే కోరారు. మంత్రుల ఆదేశాలతో వెంటనే కంట్రోల్ కోస్ట్ గార్డ్స్ రంగంలోకి దిగారు. విశాఖ తీరంలో గాలింపు చర్యలు చేపట్టారు. రెండు జిల్లాల అధికారులతో అనుక్షణం సంప్రదింపులు చేస్తూ అటు కమాండ్ కంట్రోల్, ఇటు కోస్ట్ గార్డ్స్‌తో సమన్వయం చేస్తూ మత్స్యకారుల ఆచూకీని తెలుసుకున్నారు. విశాఖ తీరానికి 150-200 కిలోమీటర్ల దూరంలో బోటు ఉన్నట్లు గుర్తించారు. బోటు డ్రైవర్‌తో కోస్ట్ గార్డ్స్ మాట్లాడి వారికి అవసరమైన ఆహారం ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వాతావరణ అనుకూలతను బట్టి వారిని ఒడ్డుకు చేర్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు కోస్ట్ గార్డ్స్ తెలిపారు.

శోకసంద్రంలో కొత్తపల్లి

కన్నీరు మున్నీరైన తల్లిదండ్రులు, బంధువులు
అండగా ఉండి ఆదుకుంటా: ఎరిక్షన్‌బాబు


కుమారుడు మను మృతదేహం వద్ద సొమ్మసిల్లిన తండ్రి భానుచారి


నివాళులర్పిస్తున్న టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, నేతలు

పెద్దారవీడు, సెప్టెంబరు 1 : ముగ్గురు చిన్నారుల మృతితో మండలంలోని కొత్తపల్లి శోకసంద్రంలో మునిగిపోయింది. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి కులవృత్తి అయిన వడ్రింగి పని చేసుకుంటున్న కొత్తపల్లి విశ్వరూపాచారి, భానుచారిల కుమారులు మను, శివ, అదేవిధంగా ఆరవీటి శ్రీను కుమారుడు ఏడుకొండలు మృతితో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు. రోజూ చలాకీగా బడికి పోతూ, వస్తూ అందరి మధ్యలో తిరిగే చిన్నారుల మృతితో కొత్తపల్లి గ్రామంలో కన్నీరు పెట్టని వారు లేరు. ఇటువంటి విషాద ఘటన మును పెన్నడూ తమ ఊరిలో జరగలేదంటూ నాటి తరం వారి నుంచి నేటితరం వారు పేర్కొంటున్నారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ వెంకటసునీల్, డివిజనల్ పంచాయతీ అధికారి భాగ్యవతి, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో రాజ్‌కుమార్‌లు చిన్నారులు మృతి చెందిన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ముగ్గురు చిన్నారుల మృతదేహాల వద్ద నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు అండగా ఉంటానన్నారు. విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి ఆయా కుటుంబాలను ఆదుకుంటానని తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసులరెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల మృతి బాధాకరం : మంత్రి స్వామి

ఒంగోలు(కార్పొరేషన్) : జిల్లాలోని పెదారవీడు మండలం ఎస్.కొత్తపల్లిలో ముగ్గురు విద్యార్థులు నీటికుంటలో పడి మృతి చెందడం బాధాకరమని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న చిన్నారులు చనిపోవడం, వారి తల్లిదండ్రుల బాధను ఎవరూ తీర్చలేనిదన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వర్షాలు తగ్గే వరకు పిల్లలను బయటకు పంపొద్దని సూచించారు.

నేడు ‘మీ కోసం’ రద్దు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 1 : భారీ వర్షాల నేపథ్యంలో ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో ప్రతివారం నిర్వహించే మీకోసంను సోమవారం రద్దు చేసినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని ఆమె కోరారు.

రాతి మండపానికి రూ.లక్ష విరాళం

అద్దంకి, సెప్టెంబరు 1 : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం రాతి ముఖ మండపం నిర్మాణానికి అద్దంకి మండలంలోని కొంగపాడుకు చెందిన ప్రియ స్టుడియో అధినేత కమ్మ నాగేశ్వరరావు, వెంకట సుజాత దంపతులు లక్ష నూట పదహారు రూపాయలను ఆదివారం అందజేసినట్లు ఈవో సుభద్ర తెలిపారు.

నేడు అరటి పండ్ల పూజ

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమవాస్య సందర్భంగా సోమవారం ఉదయం 7-39 గంటలకు అరటి పండ్లతో పూజ జరుగుతుందని ఈవో, అసిస్టెంట్ కమీషనర్ సుభద్ర తెలిపారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూసుకోవాలి



చేపల విక్రేతలకు సూచినలిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు1 : చేపలు, రొయ్యల విక్రేతలు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ తమ వ్యాపారాలు చేసుకోవాలని ఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం ఆయన సిబ్బందితో కలసి కాలుక సెంటర్లో చేపల విక్రేతలకు పలు సూచనలు చేశారు. వాస్తవానికి చేపల మార్కెట్ నిర్ణీత స్థలంలో ఉన్నా, వారికి అనువుగా ఉంటుందని కాలువ సెంటర్లో విక్రయాలు చేస్తుంటారు. ఈ క్రమంలో మీ జీవనోపాధికి ఇబ్బంది లేకుండా, అలానే ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా నడుచుకోవాలని ఎస్సై వారికి స్పష్టం చేశారు.

గుండ్లకమ్మ నదికి వరద

- తాజాగా సాగర్ నీటి విడుదల, వర్షాలే కారణం
- వరి సాగుకు సిద్ధమవుతున్న రైతులు



అద్దంకి సమీపం వద్ద గుండ్లకమ్మ నదిలో వరద

అద్దంకి, సెప్టెంబరు 1 : గుండ్లకమ్మ నదికి వరద నీటి ప్రవాహం బాగా పెరిగింది. గత రెండు రోజులుగా గుండ్లకమ్మ నది ఎగువ పరీవాహక ప్రాంతాలలో వర్షాలు, సాగర్ కాలువలకు పూర్తి స్థాయిలో నీటి విడుదల నేపథ్యంలో గుండ్లకమ్మ నదిలో నీటి ప్రవాహం ఆదివారం బాగా పెరిగింది. గత ఏడాది నుంచి గుండ్లకమ్మ నదికి ఇంతమేర వరద నీరు రాలేదు. సాగర్ నీరు కూడా విడుదల జరగడంతో ఇక గుండ్లకమ్మ నదిలో నీటి ప్రవాహం కొనసాగనుంది.

గుండ్లకమ్మ ఆధారంగా ఉన్న ఎత్తిపోతల పథకాల ఆయకట్టు రైతు లు వరిసాగుకు సిద్ధమవుతున్నారు. పట్టణానికి కూడా తాగునీటి కష్టాలు తీరినట్లయింది. అద్దంకిలో ఆదివారం ఉదాయినికి 111.4 మి.మీ వర్ష పాతం నమోదైంది. సాయంత్రం వరకు కూడా వర్షపు జల్లులు పడ్డాయి. శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు జల్లులు పడుతున్నాయి. ఆదివారం సాయం త్రం కొద్దిమేర ఎండ వచ్చినప్పటికీ ఆకాశం మేఘావృతమై ఉంది. వర్షపు జల్లులు పడుతుండడం ఆదివారం సెలవు కావడంతో అద్దంకి పట్టణంలోని వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. రెండు రోజుల పాటు ఎడతెరపి లేకుండా వర్షాలతో పొలాలలో నీరు నిలిచింది. వాగులకు నీరు చేరింది. బోరుబావుల కింద వరినాట్లు ముమ్మరం అయ్యాయి. నీటి వినియోగం లేకపోవడంతో సాగర్ కాలువల నిండా నీరు ప్రవహిస్తుంది.

నిండుతున్న వాగులు, చెరువులు

బల్లికురవ : నిన్న మొన్నటి వరకు చు క్క నీరులేని చెరువులు, వాగులు భారీ వర్షాలతో నిండుతున్నాయి. మూడు రోజుల నుంచి మండలంలోని అన్ని గ్రామాలలో కురిసిన భారీ వర్షంతో బెట్ట కొచ్చిన మెట్ట పంటలు జీవం పోసుకున్నాయి. చుక్క నీరు లేని చెరువులు వాగులకు నీరు పెద్ద ఎత్తున నీరు చేరుతోంది. మండలంలోని గుంటుపల్లి, ముక్తేశ్వరం గ్రామాల మధ్య ఉన్న పరమడ వాగు నీటి ఉధృతి కొనసాగుతోంది. ఈ నీరు బల్లికురవ వీర్లచెరువుకు చేరుతుండడంతో చెరువు కళ కళలాడుతుంది. అంబడిపూడి సాగు నీటి చెరువు పూర్తి స్థాయిలో నిండుకుంది. చెన్నుపల్లి, చెరువు పూర్తి స్థాయిలో నిండింది.

అలానే గంగపాలెం వేమవరం గ్రామాల మధ్య ఉన్న అక్కమ్మ కుంటలో మట్టిని తవ్వడంతో వర్షపు నీటితో పంటపొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బల్లికురవ మండలంలో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకున్న వర్షాలు ఇప్పటి వరకు పంటలకు ఎంతో ఉపయెగం అని రైతులు అంటున్నారు. ఇంకా వానలు పడితే పంటలకు నష్టమని వారు తెలిపారు.



బల్లికురవ : ఉధృతంగాప్రవహిస్తున్న గుంటుపల్లి ముక్తేశ్వరం వాగు



అద్దంకి : తిమ్మాయిపాలెం వద్ద పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



జాతీయ రహదారి పక్కన నీట మునిగిన పొలాలు

నీట మునిగిన పొలాలు

చీరాల, సెప్టెంబరు1 : వర్షం ప్రభావంతో పలుచోట్ల పొలాలు నీట మునిగాయి. ఇప్పటికి సాగులో ఉన్న పైర్లకు వర్షం జీవం పోసింది. ఇసుక నేల కావటంతో పొలాల్లో నీటిని వెలుపలకు పంపితే పెద్దగా నష్టం ఉండదని రైతులు అంటున్నారు. లోతట్టు ప్రాంతంలో సాగు చేసిన మినుము, పెసర పైర్లు కొన్ని చోట్ల కొంతమేర పాడయ్యే ప్రమాదం ఉంది. చేలల్లో నిలిచిన నీరు వెలుపలకు పంపేందుకు మార్గం లేక ఆగినచోట పంట దెబ్బతింటుంది. మొత్తం మీద వర్ష ప్రభావంపై రైతుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



మార్టూరు, సెప్టెంబరు 1 : మండలంలోని వలపర్ల గ్రామంలో శనివారం రాత్రి కురిసిన వర్షాలకు జడ్పీ హైస్కూల్‌కు వెళ్లే రహదారిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్ పడిపోయింది. రోడ్డుపక్కన గతంలో నేలపై సిమెంట్ దిమ్మెతో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫారమ్ వర్షం కారణంగా ఒరలు కింద ఉన్న మట్టి కరిగిపోవడంతో ట్రాన్స్‌ఫారమ్ పక్కనున్న గుంతలోకి పడిపోయింది. వినియోగదారులకు అంతరాయం కలగకుండా విద్యుత్ లైన్‌మన్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్‌ఫారమ్‌ను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆపదలో ఉన్న వ్యక్తికి రక్తదానం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 1 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం సర్జరీ చేయించుకుంటున్న వ్యక్తికి రక్తదానం చేశారు. అద్దంకికి చెందిన పీడీ ముద్దన విష్ణుప్రసాద్‌కు విజయవాడ మణిపాల్ ఆసుపత్రిలో సర్జరీ నిమిత్తం ఏబీ పాజిటివ్ రక్తం అవసరం అని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో రోగి బంధువులు రోటరీ క్లబ్ సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావును సంప్రదించగా అద్దంకికి చెందిన శివారెడ్డి, చెన్నుపల్లి వాసు, ప్రసన్న ముగ్గురు విజయవాడ వెళ్లి రక్తదానం చేశారు. రక్త దాతలను, రోటరీ సెక్రటరీ సుధాకరరావును రోటరీ క్లబ్ అధ్యక్షుడు వీరయ్య అభినందించారు.

టిఫిన్ దుకాణంలో అగ్నిప్రమాదం

- తండ్రీకుమారుడికి గాయాలు
- రూ.2లక్షల ఆస్తి నష్టం



తగలబడుతున్న దుకాణం

మార్టూరు, సెప్టెంబరు 1 : మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలో శనివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. దామవరపు శ్రీను అనే వ్యక్తికి చెందిన తాటి ఆకుతో ఉన్న దుకాణం పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో దుకాణంలోని వస్తువులతోపాటు కొంతనగదు పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిసింది. కాలిపోతున్న వాటిని బయటకు తీసే ప్రయత్నంలో యజమాని శ్రీను, అతని కుమారుడు నాగరాజులకు గాయాలయ్యాయి. ఎస్సీ కాలనీలో రోడ్డు పక్కన టిఫిన్ దుకాణాన్ని శ్రీను నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో భారీ వర్షం కారణంగా కరెంట్ పోయింది. దుకాణంలో వెలుతురు కోసం శ్రీను కొవ్వొత్తిని వెలిగించారు. కొంత సేపటికి దుకాణం బయట ఉన్న శ్రీను దుకాణంలో భారీగా మంటలు రావడం గమనించారు. కొవ్వొత్తి కారణంగా ఒక్క సారిగా మంటలు వ్యాపించాయి. వాటిని అదుపుచేయడానికి కాలనీవాసులు ప్రయత్నిస్తుండగా, దుకాణంలోపల ఉన్న నగదును, వస్తువులను బయటకు తీసుకురావడానికి ప్రయత్నించిన తండ్రీకుమారుడు గాయపడ్డారు. చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు.

దాడిపై కేసు నమోదు

చీరాల, సెప్టెంబరు 1 : మున్సిపల్ పరిధిలోని జయంతిపేటలో ఓ వ్యక్తి, మరో కుటుంబంపై దాడి చేసిన నేపథ్యంలో టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయంతిపేటకు చెందిన ఆదర్శ్, ఆనందబాబులు సమీప ఇళ్లలో ఉంటుంటారు. ఆదర్శ్ తరచూ మద్యం సేవించి అక్కడ న్యూసెన్స్ చేస్తుంటాడు. ఆనందబాబు పలుమార్లు ఆదర్శ్ చర్యలు ఖండిస్తూ వారించాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఆనంద్‌బాబు డ్యూటీకి వెళ్లగా అతని ఇంటికి ఆదర్శ్ వెళ్లి ఆనందబాబు భార్య అలేఖ్యను దుర్భాషలాడతాడు. చంపుతానని బెదిరించాడు. అలేఖ్య జరిగిన విషయాన్ని తన భర్త ఆనంద్‌బాబుకు ఫోన్‌లో తెలపగా అతను ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఆదర్శ్ మరలా ఆనంద్‌బాబు ఇంటికి గొడ్డలితో వెళ్లి ఘర్షణకు దిగుతాడు. ఈ నేపథ్యంలో అలేఖ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

చినగంజాం, సెప్టెంబరు 1 : వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిర ఆవరణలో వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిర కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసవీ క్లబ్ వ్యవస్థాపకులు కేసీజీఎఫ్ గుప్తా పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు వాసవీ క్లబ్ మండల అధ్యక్షుడు కోట సుచిత్ర తెలిపారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. శిబిరంలో 30 మంది నుంచి ఒంగోలు రెడ్ క్రాస్ సంస్థ వారు రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ పొట్టి శైలజ, మండల కార్యదర్శి భయ్యా జ్యోతి, కోశాధికారి శేషు, ఆర్యవైశ్యసంఘం జిల్లా కార్యదర్శి రామసుబ్బారావు, శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి

చెరుకూరు(పర్చూరు) 1 : పొలాల్లో వరద నీరు నిల్వ లేకుండా వెంటనే బయటకు పంపించాలని వ్యవసాయ సబ్‌డివిజన్ సహాయ సంచాలకులు ఎస్. మోహనరావు సూచించారు. ఆదివారం అధిక వర్షాల కారణంగా నీటమునిగిన పంట పొలాలను వ్యవసాయ సిబ్బందితో కలసి పరిశీలించారు. మండలంలోని చెరుకూరు, కొత్తపాలెం గ్రామాల్లోని వరి, పత్తి పొలాలను ఆయన పరిశీలించి రైతులకు తగు సలహాలు సూచనలు ఇచ్చారు. పొలంలో నీటిని తీసివేసి ఎకరానికి 30 కేజీల యూరియా, 15 కేజీల ఎంవోపీ ఎరువులను బూస్టర్ డోస్‌గా పంటలకు అందించాలన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాల నేపథ్యంలో వరి పైరులో కలుపు వచ్చే ప్రమాదం ఉందని నివారణకు ఎకరానికి 100ఎంఎల్ బిస్ పైరిబాక్ సోడియం 10శాతం చొప్పున పిచికారీ చేయాలన్నారు. పత్తిలో బయటకు నీటిని పంపిన తరువాత మల్టీ కే (13-0-45) లేదా 19-19-19 లీటరు నీటికి 10 గ్రాములు చొప్పున పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీఏ మోహనరావు



బాధితులకు ఆహార పొట్లాలను అందిస్తున్న డాక్టర్ మహేంద్రనాథ్

వర్ష బాధితులకు టీడీపీ ఆహారం పంపిణీ

చీరాల, సెప్టెంబరు1 : నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల్లో వర్షాలతో ఇబ్బంది పడుతూ ఆహారం లేని వారికి టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ ఆదివారం ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో కరకట్టలపై జీవనం సాగిస్తున్న వారి స్థితిగతులను అడగి తెలుసుకున్నారు. నాయకులు, కార్యకర్తలతో కలసి వర్షంలోనే వారికి ఆహార పొట్లాలను పంపిపెట్టారు. ఎవరు కూడా ఆహారం కోసం ఇబ్బంది పడకుండా తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. ప్రకృతి ప్రకోపాన్ని ఎవరూ ఆపలేరని, అయితే బాధితుల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా తమవంతు సాయం అందిస్తామని బాధితులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



మినుము పైరును పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, సెప్టెంబరు 1 : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాగులో ఉన్న పంటలను వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి ఆదివారం రైతులతో కలిసి పరిశీలించారు. రేణంగివరం, కొండమూరు గ్రామాలలో మినుము, పత్తి పైర్లను పరిశీలించిన ఏవో రైతులకు పలు సూచనలు చేశారు. వర్షం పడుతున్నందున పంటలో అక్కడక్కడా నీరు నిలిచి ఉందని, ఆ నీటిని బయటకు మళ్లించాలన్నారు. లీటర్ నీటికి రెండు గ్రాములు యూరియా లేదా పొటాషియం నైట్రేట్ నాలుగు గ్రాములు కలిపి వారం వ్యవధిలో మినుపై రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. మూడు రోజుల వ్యవధిలో 14 సెంటీమీటర్ల వర్షం నమోదయిందని, నిరంతరం కురుస్తున్న వర్షంతో భూమికి సరిపడా నీరు చేరిందని, సాగులో ఉన్న పంటలకు ఇప్పటి వరకు ఇబ్బంది లేదని ఏవో తెలిపారు.

తులసమ్మ మృతికి ఎమ్మెల్యే ఏలూరి సంతాపం



తులసమ్మ

వీరన్నపాలెం (పర్చూరు), సెప్టెంబరు 1 : పర్చూరు టీడీపీ జడ్పీటీసీ మాజీ సభ్యురాలు వీరన్నపాలెం గ్రామానికి చెందిన యార్లగడ్డ తులసమ్మ మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి వ్యక్తం చేశారు. ఆమె మృతి తెలుగుదేశం పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటు అన్నారు. పర్చూరు మండల తొలి జడ్పీటీసీ సభ్యురాలిగా గెలుపొందిన తులసమ్మ అభివృద్ధిలో కీలక భూమిక పోషించారని ఈసందర్భంగా ఏలూరి గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీకి తులసమ్మ చేసిన సేవలను కొనియాడారు.

ఓగేరు ఉధృతం

రాకపోకలు నిలిపివేత

సంతమాగులూరు, సెప్టెంబరు 1 : మండలంలోని గత మూడు రోజులుగా కురుస్తున్న బారి వర్షాలకు మండలంలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని గురిజేపల్లి - చవిటిపాలెం గ్రామాల మధ్యగల ఓగేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వంతెనపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు. దీంతో పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



గురిజేపల్లిలో ప్రవహిస్తున్న ఓగేరు వాగు

అదుపులోకి రాని విష జ్వరాలు

- రోజురోజుకూ పెరుగుతున్న జ్వర బాధితులు
- మంచంపట్టిన వంద మంది
- నెలరోజులుగా విలవిల
- ముక్తేశ్వరంలో అధ్వానంగా పారిశుధ్యం
- వానలతో రోగాల విజృంభణ ఆందోళనలో ప్రజలు



ముక్తేశ్వరంలో విషజ్వరంతో బాధపడుతున్న వృద్ధుడు, మంచం పట్టిన మహిళ, చిన్నారులతో అద్దంకి వైద్యశాలకు ఉన్న జ్వర బాధితులు



గ్రామంలో అధ్వానంగా పారిశుధ్యం

బల్లికురవ, సెప్టెంబరు 1 : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో విష జ్వరాలు అదుపులోకి వచ్చిన దాఖాలాలు లేవు. గత నెలరోజుల నుంచి జ్వర బాధితుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుంది అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జ్వరం కొంత మందికి తగ్గిన మరలా రెండు మూడు రోజు వ్యవధిలోనే మరలా జ్వరం వస్తుందని పగలే దోమల సంచారం అధికం అయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు మొదలు కావడంతో పారిశుధ్యం కూడా పడక వేసిందని రోడ్ల మీదే మురుగు పారుతుందని జ్వరాల బారిన పడి వారికి తగ్గక ప్రైవేట్ వైద్యశాలలకు పరుగులు పెట్టాల్సి వస్తుందని వారు తెలిపారు. అధికారులు నామ మాత్రంగా పారిశుధ్య పనులు, ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి మమ అనిపించారని జ్వరాలు అదుపులోకి మాత్రం రాలేదని ప్రజలు తగ్గోలు పెడుతున్నారు. అద్దంకి ప్రైవేట్ వైద్యశాలలోనే సుమారు 50 మంది వరకు జ్వరాలబారిన పడి వైద్యం కోసం తరలివెళ్లారని వారు అంటున్నారు. గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు కూడా విష జ్వరం బారిన పడి వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని వారు తెలిపా రు. జ్వరం వస్తే కుటుంబం మొత్తం మంచాన పడుతుందని, ఇంట్లో ఉన్న చిన్నారులకు ముం దుగా వచ్చి తదుపరి పెద్ద వారికి వ్యాప్తి చెందుతుందని కొందరికి కాళ్లు వాపులు కూడా వచ్చాయని గున్యా కూడా అధికంగా ఉందని వారు తెలిపారు. జిల్లా అధికారులు వెంటనే గ్రామాన్ని సందర్శించి జ్వరాలు అదుపులోకి వచ్చేలా పారిశుధ్య పనులు చేయించాలని ముక్తేశ్వరం గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 1 : సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లను రద్దు చేసి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యమైన పాత పెన్షన్ విధానాన్ని పు నరుద్ధరించాలని ఏపీటీఎఫ్ అద్దంకి జోన్ నాయకులు మలాది నాగరాజు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కేంద్రీకృత పెన్షన్ విధానం (యూపీఎస్) నూతన పథకానికి వ్యతిరేకంగా ఆదివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ అనే నూతన విధానాన్ని తీసుకురావాలని కేబినెట్‌లో నిర్ణయించిందని, ఈ పథకం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రామయ్య, రమేష్‌బాబు, ఎలీషా, వెంకట్రావు, చెంచుబాబు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

మార్టూరు : పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ ఆదివా రం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు తమ నిరసనను తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ మాదుగుల కిషోర్, జయకుమార్, కంభంపాటి ప్రశాంత్, శిఖా నాగేశ్వరరావు, జానీ బాషా, సుబ్బారాయుడు, బండారు రాంబాబు, కత్తి మునలయ్య, కటారు కోటయ్య లతోపాటు నాలుగుమండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అంజయ్యకు పింఛన్ ఇస్తున్న ఉద్యోగి, టీడీపీ నాయకులు

చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛన్ అందజేత

అద్దంకిటౌన్, సెప్టెంబరు 1: మండలంలోని మణికేశ్వరం గ్రామానికి చెందిన మందా అంజయ్య పింఛన్‌దారుడు. ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఒంగోలు ఆసుపత్రిలో చికిత్స పొంతున్నారు. ఈ క్రమంలో ఆదివారం గ్రామ సచివాలయ ఉద్యోగి అంకమ్మరావు, ఐటీడీపీ నాయకలు కరిముల్లా ఒంగోలు ఆసుపత్రికి వెళ్లి లబ్ధిదారుడు అంజయ్యకు పింఛన్‌ను అందజేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బల్లికురవ, సెప్టెంబరు 1 : గ్రామాలలో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జీవీ చౌదరి సూచించారు. ఆదివారం అయన మాట్లాడుతూ పలు గ్రామాలలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని ప్రజలు అత్యవసరమైతేనే ప్రయాణాలను చేయాలన్నారు. ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. అలానే గ్రామాలలో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే వారి వివరాలు సేకరించి అనుమానం కలిగితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాలలో తమ సిబ్బంది నైట్ బీట్ తిరుగుతున్నారని, చోరీలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు.



కాల్వ గండిని పూడ్చిన నేతలు

మైనర్ కాలువకు గండి

పూడ్చిన టీడీపీ నాయకులు

ఇంకొల్లు, సెప్టెంబరు 1 : ఇంకొల్లు మండలంలోని పోలిమేర ఆంజనేయస్వామి గుడి సమీపంలో పావులూరు ఎస్ఎస్పీ మైనర్ క్వాలకు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గండి పడింది. సాగర్ కాల్వకు పావులూరు రోడ్డుకు మధ్య ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచనల మేరకు స్పందించిన పావులూరు గ్రామ టీడీపీ నేతలు గుంజి వెంకట్రావు, నారిశెట్టి రాంబాబు, తన్నీరు రామాంజనేయులు, అన్నెం వెంకట్రావు, పావులూరి రవి, అశోక్, శ్రీను, కొత్తపల్లి మహేష్, మోషే, వలేరు డేవిడ్, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ఆదివారం కాలువ గండి పూడ్చారు.

నేడు పర్చూరులో మెగా రక్తదాన శిబిరం

పర్చూరు, సెప్టెంబరు 1 : జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ప్రవాశాంధ్రుడు, జనేసేన పర్చూరు నియోజకవర్గ నాయకుడు మన్నెం శ్రీకాంత్ ఆధ్వర్యంలో పర్చూరులో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని జనసేన పార్టీ నాయకులు ఆదివారం ప్రకటలో కోరారు. పర్చూరులోని ఎఎస్‌వీఎస్ బాలికల పాఠశాలలో సోమవారం ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభిస్తారని తెలిపారు.